



తహశీల్దార్ కార్యాలయం ఎదుట సంకల్ప దీక్షలో యుటిఎఫ్ నాయకులు

పేదల గూళ్లు... ఇంకెన్నాళ్లు?

- నత్తనడకన 'జగనన్న' ఇళ్ల నిర్మాణాలు
- 73,756 ఇళ్లకు 12,116 మాత్రమే పూర్తి
- ఉగాదికైనా లక్ష్యం నెరవేరానా?
- 40 శాతం మాత్రమే పూర్తి



నారాయణరెడ్డిగారిపల్లె లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలు

ప్రజాశక్తి - రాయచోటి

పేదల సొంతింటి కల సాకారం కానంటోంది. నవరత్నాల్లో భాగంగా చేపట్టిన జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు నత్తనడకన సాగుతుండటంతో లక్ష్యం నెరవేరడం లేదు. ఇళ్లు ఎప్పుడు పూర్తవుతాయోనని లబ్ధిదారులకు ఎదురుచూపులు తప్పడం లేదు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా జగనన్న కాలనీలు-పేదలకు ఇళ్లు పథకాన్ని ప్రారంభించింది. జిల్లా వ్యాప్తంగా జిల్లా వ్యాప్తంగా 496 లేఅవుట్లు ఏర్పాటు చేశారు. అర్హులైన లబ్ధిదారులను గుర్తించి 73,756 గృహాలు మంజూరయ్యాయి. రూ.13.24 కోట్ల నిధులు కేటాయించింది. ఆయా లేఅవుట్లలో 12,116 గృహాలు మాత్రమే పూర్తయ్యాయి. ఇంకా మొదలు పెట్టని గృహాలు 6,726 ఉన్నాయి. ఇందులో బిలో బేస్ మెట్ లెవెల్ 23,518, పునాదులు 21,290, గోడలు 7,248, స్లాబులు 6,263, వివిధ దశలలో మిగతా పనులు నత్తనడకన సాగుతున్నాయి ప్రభుత్వమే ఒక గృహానికి రూ.1.80 లక్షలు మంజూరు చేస్తుంది. పైగా 20 టన్నుల ఇసుకను ఉచితంగా ఇవ్వడంతోపాటు సిమెంటు ఒక బస్తా ధర రూ.229లతో 90 బస్తాలను, స్టీల్ కేజీ రూ.66లతో 480 కిలోల స్టీల్‌ను తక్కువ రేట్లతో లబ్ధిదారులకు అందజేస్తున్నారు. ఇన్ని సదుపాయాలు ప్రభుత్వం ప్రవేశపెట్టినప్పటికీ లబ్ధిదారులు గృహాలు వేగవంతం కావడం లేదంటే గృహ నిర్మాణ శాఖ వారు లబ్ధిదారులకు సరైన అవగాహన కల్పించకపోవడమే లోపమని పలువురు చర్చించు కుంటున్నారు. గృహాలు వేగవంతం చేయాలని వారంలో రెండు, మూడు రోజులు రాష్ట్ర గృహ శాఖ నుంచి సమీక్షలు నిర్వహించినా పనుల్లో వేగం కనిపించడంలేదు. గృహ నిర్మాణ శాఖ కాకుండా, ఇతర శాఖను కూడా ప్రత్యేక అధికారులుగా నియమించి నియమించారు. ఇతర శాఖ వారు బాధ్యతగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ, గృహ నిర్మాణ శాఖలో ఆ బాధ్యతను గాలికి వదిలేస్తున్నారుని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటి వరకు కేవలం 40 శాతం మాత్రమే పూర్తి చేశారు. జిల్లా కేంద్రంలోని నారాయణరెడ్డిగారిపల్లె వద్ద జగనన్న కాలనీలో నత్తనడక సాగుతున్న పనులను కలెక్టర్ గిరీష గత నెల 22వ తేదీన పరిశీలించారు. కాలనీలో ద్విచక్ర వాహనంలో వీధి వీధి తిరిగి పరిశీలించారు. కాలనీలో వేగవంతం చేయాలని జిల్లా గృహ నిర్మాణ శాఖ వారికి ఆదేశాలు ఆదేశాలు జారీ చేశారు. అయినప్పటికీ గృహ నిర్మాణ పనులు నత్తనకు నడకలు నేర్పేవిధంగా సాగుతు న్నాయని పలువురు చర్చించుకుంటున్నారు. జిల్లాలో మిగిలిన గృహాలు పూర్తి చేయాలంటే ఇంకా ఎన్ని రోజులు సమయం పడుతుందో వేచి చూడాలి.

లక్ష్యాలను పూర్తి చేస్తాం

జిల్లాలో జగనన్న గృహాల నిర్మాణ పనుల లక్ష్యాలను పూర్తి చేస్తాం. ఉగాది నాటికి పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాం. మండల హౌసింగ్ ఇంజినీర్‌తో సమీక్ష సమావేశాల్లో కూడా నిర్వహిస్తున్నాం. లక్ష్యాన్ని పూర్తి చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

- శివయ్య, హౌసింగ్ పీడీ, రాయచోటి.



నారాయణరెడ్డిగారిపల్లె లేఅవుట్‌లో విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేయని వైర్లు

సిపిఎస్‌ను రద్దు చేయాల్సిందే

- సంకల్ప దీక్షలో యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - రాయచోటిటౌన్

ముఖ్యమంత్రి ఇచ్చిన మాట ప్రకారం సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను అమలు చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, జాబీర్ పేర్కొన్నారు. ఈ నెల 3న ధర్మస్థలి వేదక వద్ద సంకల్ప దీక్షను పోలీసులు అడ్డుకున్నందుకు నిరసనగా ఆదివారం రాయచోటి తహశీల్దార్ కార్యాలయం ఎదుట నాయకులు సంకల్ప దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిపిఎస్‌ను రద్దు చేయాలని గతంలో పలుమార్లు అనేక ఉద్యమాలు చేపట్టామన్నారు. గత ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నేతగా ఉన్న జగన్మోహన్‌రెడ్డి తాను అధికారంలోకి వస్తే వారంలోపే సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్దరిస్తానని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఆ మేరకు ఉద్యోగ, ఉపాధ్యాయుల అండదండలతో అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి, గద్దెనెక్కాక విస్మరించారని విమర్శించారు. అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు అవుతున్నా సిపిఎస్ కొనసాగుతూనే ఉందని చెప్పారు. సిపిఎస్ పట్ల ముఖ్యమంత్రికి అవగాహన లేకపోవడం వల్లే రద్దు పై హామీ ఇర్చారని సలహాదారులు, ప్రభుత్వ పెద్దలు ప్రకటనలు ఇవ్వడం దారుణమన్నారు. సిఎం ఇచ్చిన హామీని నెరవే ర్చాలని డిమాండ్ చేశారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాల్సిందేనని, ప్రత్యామ్నాయంగా ప్రవేశపెడతామంటున్న జిపిఎస్‌ను ఒప్పుకొనే ప్రశ్నేలేదని పేర్కొన్నారు. పాత పింఛన్‌ను అమలుచేసే వరకు పోరాటాన్ని ఆపేది లేదని తెగేసి చెప్పారు. జిపిఎస్ పేరుతో ఉద్యోగ, ఉపాధ్యాయులను మరోసారి వంచించేందుకు ఈ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని పేర్కొన్నారు. జిపిఎస్ వల్ల ఉద్యగులకు ఒరిగేదేమీ లేదని వాపోయారు. పైగా నష్టదాయకమని చెప్పారు. మరో వైపు దేశంలో సిపిఎస్‌ను రద్దు చేసిన రాష్ట్ర ప్రభుత్వాలకు నిధులు ఇవ్వమని, ఖజానా ఖాళీ అవుతుందని కేంద్ర ప్రభుత్వం బెదిరించడాన్ని తీవ్రంగా తప్పు పట్టారు. అంతక మునుపు ఫ్యాప్టో అన్నమయ్య జిల్లా సెక్రటరీ జనరల్ రవి శంకర్ యుటిఎఫ్ నాయకులకు పూలదండలు వేసి దీక్షను ప్రారంభించారు. దీక్షకు సంఘీభావంగా వారు మాట్లాడుతూ పాలకులు ఉద్యోగ వ్యతిరేక విధానాలతో రాజ్యాంగ పరమైన హక్కులను కాలరాయడాన్ని ఉద్యమాలతో అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ నిర్బంధాలకు భయపడే ప్రశ్నే లేదని, ఇచ్చిన మాట ప్రకారం సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ ను పునరుద్ధరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సిపిఎస్ కన్వీనర్ రమణమూర్తి జిల్లా గౌరవాధ్యక్షుడు సుధాకర్ నాయుడు, జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పురం వెంకట రమణ, వివిధ మండలాల నాయకులు నాగేంద్ర, కిఫాయత్, రెడ్డి ముని సుధాకర్, శ్యామ్ సుందర్, ఇర్ఫాన్, రెడ్డి బసయ్య, మునిరత్నం నాయుడు, బావా జాన్, రమణ, శంకరయ్య, రఫీక్ ఖాన్, సుబహాన్, పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కేశాలు దానం చేస్తున్న యువతి రిషిత

కేశాలు దానం చేసిన యువతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కేన్సర్ బాధితులకు ఓ యువతి అండగా నిలిచింది. నేను సైతం అంటూ తన కేశాలను దానం చేసింది. పట్టణానికి చెందిన హెల్పింగ్ మైండ్స్ సంస్థ తలపెట్టిన హెయిర్ డొనేషన్ కార్యక్రమానికి మహిళలు, అమ్మాయిలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కేశాలు దానం చేస్తున్నారు. మదనపల్లెకు చెందిన విజయ లక్ష్మి, నాగరాజ దంపతుల కుమార్తె రిషిత హెల్పింగ్ మైండ్స్ కార్యాలయానికి విచ్చేసి తన కేశాలను దానం చేశారు. వారికి పూలమొక్కలు బహుకరించి అభినందించిన హెల్పింగ్ మైండ్స్ బృందం. ఈ సందర్భంగా హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకులు అబూబక్కర్ సిద్దిక్ మాట్లాడుతూ ఇప్పటికే 27 మంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కేశాలు దానం చేసారని, రాష్ట్ర వ్యాప్తంగా కేన్సర్ భాదితులకు ఎవరికైనా విగ్గులు కావాలంటే తమ సంస్థ ఉచితంగా పంపిణీ చేస్తుందని పేర్కొన్నారు. రిషిత మాట్లాడుతూ హెల్పింగ్ మైండ్స్ సేవల్లో భాగస్వామ్యం అవ్వడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యత

మదనపల్లె అర్బన్: ప్రజా సంక్షేమం కోసం బాధ్యతగా పనిచేస్తానని జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ ఎస్.ఎ.కరీముల్లా పేర్కొన్నారు. ఆదివారం 14వ వార్డులో కౌన్సిలర్ షేక్ షబానా, సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లతో కలిసి విస్తృతంగా పర్యటించారు. బుగ్గకాలువలోని గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు కరీముల్లాను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్ బాషాల సహకారంతో వార్డును అన్ని విధాల అభివృద్ధి చేస్తామన్నారు. అర్హులందరికీ సకాలంలో సంక్షేమ పథకాలను అందజేస్తున్నామన్నారు ప్రజలకు ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని, వాటిని సత్వర పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలన దేశానికి ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

రాయచోటి : స్పందన అర్జీల స్వీకరణ కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్లు కలెక్టర్ గిరీష ఆదివారం ఒక ప్రకనటలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంతో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా యథావిధిగా స్పందన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. ముఖ్యంగా మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే స్పందనకు రాగలరని తెలిపారు. స్పందన కార్యక్రమం ప్రారంభానికి ముందు ఉదయం 9.45 గంటలకు అధికారులతో స్పందన పెండింగ్ దరఖాస్తులపై సమీక్ష సమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నారు. స్పందనకువచ్చిన అర్జీలకు సంబంధించిన పరిస్కారాలు ఎన్ని చేశారనే వివరాలతో అధికారులు రావాలన్నారు. అన్ని శాఖల అధికారులతో సహా స్పందనలో పాల్గొనే ప్రతి ఒక్కరూ కొవిడ్ ప్రోటోకాల్ పాటించాలని పేర్కొన్నారు.

క్రీడల్లో రాణిస్తున్న కార్పొరేటర్ ఉషశ్రీ

ప్రొద్దుటూరు: ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ ప్రజలకు సేవ చేస్తూనే మరొకపక్క జాతీయ స్థాయిలో బ్యాడ్మింటన్ క్రీడాకారిణిగా రాణిస్తూ విశాఖ పేరు ప్రఖ్యతలను దేశ వ్యాప్తంగా నిలబెడుతున్నారు మహా విశాఖ నగర పాలక సంస్థలో 43వ వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ. ఆమె జివిఎంసి కార్పొరేటర్‌గా వార్డులో సమస్యల పరిష్కారానికి అహర్నిశలు కృషి చేస్తూనే మరొకపక్క తన ఆశయ సాధన కోసం నిరంతరం శ్రమించి సాధన చేస్తూ జాతీయ, రాష్ట్ర స్థాయి క్రీడాకారిణిగా రాణిస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవల కడప జిల్లా ప్రొద్దుటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి మాస్టర్స్ బ్యాడ్మింటన్ ఛాంపియన్షిప్-2023లో 45 ఏళ్ల క్యాటగిరిలో సింగిల్స్, మిక్స్ డబుల్ గెల్చుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 26 జిల్లాల నుండి స్త్రీ, పురుషుల విభాగాలలో జరిగిన ఈ పోటీల్లో మహిళల సింగిల్స్ విభాగంలోనూ, మిక్సిడ్ డబల్ విభాగంలోనూ ఆమె ప్రథమ స్థానంలో గెలిచారు. ఈ రాష్ట్ర స్థాయి చాంపియన్షిప్ గెలుచుకున్న అనంతరం వచ్చే నెలలో గోవాలో జరగబోయే నేషనల్ ఛాంపియన్షిప్‌కు ఆమె ఆంధ్రప్రదేశ్ ప్రాతినిధ్యం వహించనున్నారు.



గెలుపొందిన ట్రోఫీలతో ఉషశ్రీ

మానసిక ఉల్లాసానికి క్రీడలు ముఖ్యం

- కలెక్టర్ పి.ఎస్.గిరీష
- హోరా హోరీగా సాగిన కలెక్టర్, ఎస్‌పి జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్
- 25 పరుగుల తేడాతో ఎస్‌పి జట్టు విజయం

ప్రజాశక్తి - కడప/రాయచోటి

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీష పిఎస్ పేర్కొన్నారు. ఆదివారం కడపలోని వైయస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో అన్నమయ్య జిల్లా, కలెక్టర్ -11, ఎస్‌పి -11 జట్ల మధ్య టి20 క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. క్రీడాకారులను అన్నమయ్య కలెక్టర్ గిరీష, ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు, జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు భరత్ రెడ్డి, కార్యదర్శి ఏ.రెడ్డి ప్రసాద్, ఎస్‌సిఎస్‌బ్ జోన్ అకాడమీ కన్వీనర్ సంజయ్ కుమార్ రెడ్డి పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రీడలలో పాల్గొని నిండు నూరేళ్లు ఆరోగ్యంగా జీవించాలన్నారు. ఈ క్రికెట్ పోటీలలో ఓడినవారు నిరుత్సాహం చెందకుండా రాబోయే మ్యాచ్ లో గెలవాలనే లక్ష్యంతో ముందుకు వెళ్లాలన్నారు. వైఎస్ఆర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ భరత్ రెడ్డి కడప మాస్టర్స్ క్రికెట్ క్లబ్ తరపున క్రికెట్ కిట్, 50 మందికి క్రికెట్ యూనిఫామ్ అందజేయడం ఎంతో శుభపరిణామన్నారు. ఎస్‌పి మాట్లాడుతూ కలెక్టరేట్, ఎస్‌పి కార్యాలయాల సిబ్బంది మంచి స్పోర్టివ్‌గా క్రికెట్ మ్యాచ్ ఆడారని చెప్పారు. విధి నిర్వహణలో ఉన్నప్పటికీ క్రికెట్ మ్యాచ్ ఇంతటితో ఆపకుండా క్రమం తప్పకుండా ప్రాక్టీస్ చేస్తూ క్రికెట్ ఆడుతూ ఉండాలన్నారు. దీంతో శరీర దృఢత్వంతో పాటు ఆరోగ్యంగా ఉంటామన్నారు. అనంతరం జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు టాస్ వేసి మ్యాచ్‌ను ప్రారంభించారు.



విజేతగా నిలిచిన ఎస్‌పి ఎలెవన్ జట్టు

25 పరుగుల తేడాతో ఎస్‌పి జట్టు విజయం

కలెక్టర్, ఎస్‌పి జట్ల మధ్య ఆదివారం కడపలోని వైయస్ రాజారెడ్డి ఏసిఎస్ స్టేడియంలో నిర్వహించిన టి20 మ్యాచ్ లో 25 పరుగుల తేడాతో ఎస్పీ -11 జట్టు గెలిచింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఎస్‌పి జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 176 పరుగులు చేసింది. అనంతరం 177 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగుకు దిగిన కలెక్టర్ జట్టు 19.5 ఓవర్లలో 151 పరుగులకు ఆల్ అవుట్ అయ్యి ఓటమి చెందింది. ఎస్‌పి టీమ్‌కు చెందిన శ్రీనివాస్ 66 పరుగులు, 2,వికెట్లు తీసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ గా నిలిచారు. కలెక్టర్ టీంకు చెందిన పెంచలయ్య 5 ఫోర్లు, ఒక 6 మొత్తం 38 పరుగులతో బెస్ట్ బ్యాట్స్మెన్ గా నిలిచారు. బెస్ట్ బౌలర్ గా హేమంత్ రెడ్డి నిలిచారు. విన్నర్స్, రన్నర్స్ క్రికెట్ విజేతలకు జిల్లా కలెక్టర్, ఎస్‌పి చేతుల మీదుగా కడప మాస్టర్స్ క్రికెట్ క్లబ్ తరపున మెడల్స్, మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ భరత్ రెడ్డి, అన్నమయ్య జిల్లా కలెక్టరేట్, ఎస్‌పి కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

మార్చి 30 నుంచి 'కోదండ రాముడి' బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

శ్రీ కోదండరామ స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించడానికి అవసరమైన ఏర్పాట్లు సిద్ధం చేయాలని టిటిడి జెఇఒ వీరబ్రహ్మం అధికారులకు సూచించారు. తిరుపతిలోని టిటిడి పరిపాలన భవనంలోని తన చాంబర్లో గురువారం సాయంత్రం ఆయన ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాల నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ కోదండరామ స్వామి కల్యాణానికి అవసరమైన తలంబ్రాల తయారీని ఎప్పుడు ప్రారంభించాలనే అంశంపై అధికారులతో చర్చించారు. బ్రహ్మోత్సవాలకు డిప్యూటేషన్ మీద నియమించే అధికారులు, ఉద్యోగులతో పాటు శ్రీవారి సేవకులకువసతి ఆహారం ఏర్పాట్లపై ముందస్తుగా ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. స్వామివారి కల్యాణానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చే భక్తులకు అన్నప్రసాదాల పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. భక్తులకు ఎండ వేడిమి నుంచి ఉపశమనం కలిగించడానికి విరివిగా మజ్జిగ తాగునీరు పంపిణీ చేయడానికి అవసరమైన కౌంటర్లు సిద్ధం చేసుకోవాలన్నారు. టిటిడి విజిలెన్స్ అధికారులు స్థానిక పోలీసులతో సమన్వయం చేసుకుని భద్రత, పార్కింగ్ ఏర్పాట్లకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని చెప్పారు. ఆలయం, కల్యాణ వేదిక వద్ద భక్తులను ఆకట్టుకునేలా పుష్పాలంకరణలు, విద్యుత్ అలంకరణలు చేయాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పంచాయతీ సిబ్బందిని సమన్వయం చేసుకుని పారిశుధ్యం ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ప్రథమ చికిత్స కేంద్రాలు, అవసరమైన మందులు, సిబ్బందిని సిద్ధం చేసుకోవాలని సూచించారు. బ్రహ్మోత్సవాల వాహన సేవల ముందు హిందూ ధర్మ ప్రచార పరిషత్ భజన బృందాలచే ఆకట్టుకునేలా ప్రదర్శనలు ఉండాలని, కల్యాణోత్సవం రోజున చక్కటి కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. రథోత్సవ నిర్వహణ ఎలా ఉండాలి, సిబ్బంది ఎంతమంది అవసరం అనే విషయాలపై అధికారులతో సమీక్షించారు. కాగా మార్చి 30వ తేదీన బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరగనుంది. 31వ తేదీ ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. సమీక్షలో డిప్యూటీ ఇఒలు గుణభూషణ్‌రెడ్డి, గోవిందరాజన్, సుబ్రహ్మణ్యం, శ్వేత డైరెక్టర్ ప్రశాంతి, అన్నదానం ప్రత్యేక అధికారి జిఎల్ఎన్ శాస్త్రి, అదనపు ఆరోగ్యాధికారి డాక్టర్ సునీల్ కుమార్, డిఎఫ్ఒ శ్రీనివాసులు పాల్గొన్నారు.

బ్రౌన్ గ్రంథాలయానికి 400 పుస్తకాలు బహూకరణ

ప్రజాశక్తి-కడప అర్బన్

కడప పట్టణానికి చెందిన ప్రముఖ శిశువైద్య నిపుణులు, రచయిత కీ.శే.ఆవుల రామచంద్రయ్య సతీమణి ఆవుల విమల 400 పుస్తకాలను ఆదివారం ఉదయం తన స్వగృహంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, గ్రంథపాలకులు ఎన్.రమేశ్‌రావులకు అందజేశారు. ఈ సందర్భంగా మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ ఆవుల విమల తన భర్త ఆవుల రామచంద్రయ్య రచించిన 'ఓం నమ: శివాయ'(వచనములు) 100 పుస్తకాలు, 'త్రివర్గము'(తిరుక్కురల్ తెలుగులో) 150 పుస్తకాలు, 'విశ్వభారతి'(నవల) 150 పుస్తకాలు మొత్తం 400 పుస్తకాలున్నట్లు పేర్కొన్నారు. తెలుగు విద్యార్థులు, పరిశోధక విద్యార్థులు, సాహితీవేత్తలు, సాహితీప్రియులు, ఆసక్తి కలిగిన పాఠకులు ఈ పుస్తకాలను ఉచితంగా పొందవచ్చని, కావలసినవారు సి.పి.బ్రౌన్ గ్రంథాలయానికి వచ్చి తీసుకోవచ్చునని తెలియజేశారు. పుస్తకాలను బహూకరించిన ఆవుల విమలని యోగి వేమన విశ్వవిద్యాలయం బాధ్య ఉపకులపతి ఆచార్య జి.రంగ జనార్ధన, కులసచివులు ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య అభినందించారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, గ్రంథపాలకులు జి.హరిభూషణరావు, జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకట రమణ, ఎం.మౌనిక, సిబ్బంది సి.నీలకంఠేశ్వర్, పి.చంద్రకిశోర్‌లు హర్షం వ్యక్తం చేశారు.



సిపి బ్రౌన్ గ్రంథాలయానికి పుస్తకాలు అందజేస్తున్న విమల



కంటి రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

38 మందికి ఆపరేషన్లు

ప్రజాశక్తి - రాయచోటి

మండల పరిధిలోని చెన్నముక్కపల్లెలో ఉన్న లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరంలో 38 మందికి ఆపరేషన్లు నిర్వహించారు. ఈ సందర్భంగా రాయచోటి నియోజకవర్గంతో పాటు జిల్లా పరిధిలోని రాజంపేట, రైల్వే కోడూరు, పీలేరు, కలకడ, కలికిరి, యర్రావారిపాలెం, కేవీపల్లి, గుర్రంకొండ, పెద్దమండెం తదితర ప్రాంతాల నుంచి వచ్చిన 80 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించారు. అందులో అర్హులైన 38 మంది కంటి రోగులకు ఆపరేషన్లు చేశారు. నెల రోజుల విరామం గతంలో ఆపరేషన్ చేయించుకున్న 60 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా అద్దాలు, మందులు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ కంటి ఆసుపత్రి చైర్మన్ వైవిఆర్ స్వరూప గుప్తా, ఏపీఐఐసీ డైరెక్టర్ శ్రీనివాసులు రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్‌బాష, లయన్స్ డిస్ట్రిక్ట్ చైర్మన్ శివరామిరెడ్డి, కంటి వైద్యులు సురేష్ బాబు, భార్గవి, మహాలక్ష్మి, ఆప్తాలిక్ అసిస్టెంట్ రాజగోపాల్ రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

నేడు అంగన్వాడీల ధర్నా : సిఐటియు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

అంగన్వాడీల సమస్యల పరిష్కారం కోసం సోమవారం ధర్నా నిర్వహించనున్నట్లు సిఐటియు జిల్లా అధ్యక్షులు సి.హెచ్. చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి ఎ. రామాంజులు పేర్కొన్నారు. ఆదివారం వారు విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వం ఫిబ్రవరి ఒకటి నుంచి అంగన్వాడీ కేంద్రాల్లో ప్రవేశపెట్టిన ముఖ హాజరు యాప్‌ను విరమించుకోవాలన్నారు. 2 జిబి మొబైల్స్ ఇచ్చి 8 జిబీ పనులు చేయించాలనుకోవడం సరైంది కాదన్నారు. నెట్ సౌకర్యం కూడా కేంద్రాలలో ఉండదన్నారు. జాబ్ క్యాలెండర్ నిర్ణయించి,సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. సంపూర్ణ పోషణకు మెనూ ఛార్జీలు పెంచాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవ్‌లు ఇవ్వాలని కోరారు. ఉద్యోగోన్నతలను అర్హత అన్న ఆయాలకు కచ్చితంగా పోస్ట్ ఇచ్చిన తర్వాతే ఖాళీలను భర్తీ చేయాలన్నారు. మినీ కేంద్రాలను మెయిన్ కేంద్రాలకు మార్చాలని, సకాలాలంలో వేతనాలు ఇవ్వాలని, పెండింగ్ జీతాలు, బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ధరలకు అనుగుణంగా కనీసవేతనం రూ.26 వేలు ఇవ్వాలని, రిటైర్డ్ మెంట్ బెనిఫిట్ సౌకర్యం రూ.5 లక్షలు పెంచాలని, సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం గ్రాడ్యుటీ అమలు చేయాలన్నారు. 2017 నుంచి టిఎ, డిఎ ఇవ్వాలన్నారు. పర్యవేక్షణ పేరుతో అంగన్వాడీ వర్కర్లపై వేధింపులు ఆపాలన్నారు.

కాంగ్రెస్ మద్దతివ్వడం సిగ్గుచేటు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రలో అడుగడుగునా ఆయన రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ బొమ్మను నెత్తిన పెట్టుకొని కీర్తిస్తూ వెళితే, మదనపల్లెకు చెందిన కొందరు కాంగ్రెస్ నాయకులు మాత్రం తమ అధినేత ఆలోచనలకు భిన్నంగా వ్యవహరిస్తూ, అంబేద్కర్‌ను అవమానించినోళ్లకు మద్దతు తెలుపుతూ నిస్సిగ్గుగా ఆందోళనలు చేస్తున్నారని విసికె పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిటిఎం శివప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈ విషయంపై స్థానిక నేతలపై రాహుల్‌గాంధీకి ఫిర్యాదు చేస్తామన్నారు. పట్టణంలోని బైపాస్ రోడ్డుకు సమీపంలోని చంద్రాకాలనీకి 25 ఏళ్ల క్రితమే అంబేద్కర్ నగర్‌గా నామకరణం చేశారని తెలిపారు. నేమ్ బోర్డు ఏర్పాటు చేశారన్నారు. అంబేద్కర్ పేరు తొలగించి జహా చేనేత నగర్‌గా పెట్టారన్నారు.

విద్యార్థులకు సంగీత, నృత్య పోటీలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కళా తరంగిణి సంస్థ ఆధ్వర్యంలో సంగీత, నృత్య పోటీలు పట్టణంలోని కృష్ణానగర్ జ్ఞానోదయ హైస్కూల్ ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించారు. సంస్థ అధ్యక్షులు రాజేష్ బాబు ఆధ్వర్యంలో జరిగిన 149వ కళా తరంగిణి సంగీత, నృత్య పోటీలలో విద్యార్థులు కళా రంగంలో దాగివున్న తమ ప్రతిభను చాటిచెప్పారు. ఇందులో సంగీత, నృత్య పోటీలలో భక్తి గీతాలు, దేశ భక్తిగీతాలు, జానపద గేయాలు, సినిమా పాటలు, శాస్త్రీయ, సోలో, జానపద,సినీ నృత్యాలలో జరిగిన పోటీలకు న్యాయ నిర్ణేతలుగా కమాల్ బాషా, బాలరాజ, మస్తాన్ వ్యవహరించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. జూనియర్స్, సీనియర్స్, సబ్ జూనియర్స్ విభాగాల్లో పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేష్ బాబు మాట్లాడుతూ 30 ఏళ్లుగా జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఎన్నో విద్యా, సాంస్కృతిక పోటీలు విజయవంతంగా నిర్వహించి, ప్రతిభ వున్న వారిని గుర్తించి ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్నామని పేర్కొన్నారు.


స్నేహితుడి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సహచర విద్యార్థులు

స్నేహితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-పుల్లంపేట

స్థానిక ఎస్‌బివిఎడి సభ ఉన్నత పాఠశాలలో 1982-83 బ్యాచ్ కు చెందిన సహచర విద్యార్థి వెంకటరమణ ఇటీవల మృతి చెందడంతో ఆ బ్యాచ్ కు చెందిన తోటి పూర్వ విద్యార్థులు ఆదివారం వెంకటరమణ కుటుంబానికి రూ.1.2 లక్షలు చెక్కుతోపాటు మూడు నెలలకు సరిపడా నిత్యవసర సరుకులను అందించి మానవత్వం చాటుకున్నారు. వెంకటరమణ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. వెంకటరమణ ఉపాధ్యాయుడిగా ఉద్యోగ విరమణ పొంది ఇటీవలే మరణించారు. కార్యక్రమంలో రిటైర్డ్ తెలుగు ఉపాధ్యాయుడు మునిరత్నం, సహచర విద్యార్థులు పాల్గొన్నారు.


కలకడలో వివాహానికి హాజరైన ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వివాహ వేడుకల్లో 'చింతల'


ప్రజాశక్తి -కలకడ

మండలంలో జరిగిన రెండు వివాహాలకు ఎమ్మెల్యే చింతల రామచంద్రా రెడ్డి హాజరయ్యారు. మండలంలోని స్థానిక ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ మస్తాన్ అహ్మద్ కుమారుడు, స్థానిక వైసిపి నాయకులు షావత్ అలీఖాన్ సోదరుడి కుమారుడి వివాహాలకు ఎమ్మెల్యే హాజరయ్యారు. రెండు వివాహాల్లోని పెళ్లి కుమారులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఎంపిపి శ్రీదేవి రవికుమార్, సర్పంచ్ రాజగోపాల్ రెడ్డి, సింగల్ విండో చైర్మన్ కమలాకర్ రెడ్డి వైసిపి నాయకులు కరీముల్లా భాష, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

అప్పర్‌భద్రతో రాయలసీమకు ముప్పు

ప్రజాశక్తి -కడప అర్బన్

కర్ణాటకలో నిర్మి స్తున్న అప్పర్ భద్ర ప్రాజెక్టుకు కేంద్ర బడ్జెట్‌లో రూ.5,300 కోట్లు కేటాయి ంచడం రాయలసీమ నీటి వన రులకు తీవ్ర ముప్పు వాటిల్లు తుందని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి. దస్తగిరి రెడ్డి తెలిపారు. ఆదివారం రైతు సంఘం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్ణాటకలో త్వరలో జరగనున్న ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు రెండు రాష్ట్రాల్లోని కరువు ప్రాంతాల ప్రజల మధ్య వైషమ్యాలు సృష్టించడానికి బిజెపి సిద్ధమైందన్నారు. నిత్యం కరువులకు గురవుతున్న రాయలసీమ జిల్లా ప్రజలకు కొంత మేరకైనా సాగు, తాగు నీరు అందించే తుంగభద్ర ప్రాజెక్టు పైన నిర్మించే 'అప్పర్ భద్ర' వల్ల సీమ ఎడారిగా మారుతుందని తెలిపారు. అనంతపురం, కర్నూలు, కడప జిల్లాలకు తుంగభద్ర నుంచి వచ్చే నీరే ప్రధాన సాగునీటి వనరని తెలిపారు.


ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమానికి హాజరైన జయరాం నాయుడు

వైభవంగా సత్యనారాయణ స్వామి ధ్వజస్తంభ ప్రతిష్ట

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మండలంలోని చిప్పిలి, చిట్టి అన్నవరంలో వెలసిన లక్ష్మీ సమేత శ్రీసత్య నారాయణ స్వామి దేవాలయంలో రాతి ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవాన్ని ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ కంచేపల్లి అమరనాథ్, కార్యదర్శి వైద్యం రామకృష్ణ శర్మ, ఆలయ ధర్మకర్తలు మునిగోటి శ్రీనివాస శర్మ, మహేశ్వరుల శివశంకర్‌లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నియోజకవర్గ టిడిపి నాయకులు శ్రీరామినేని జయరామ నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా జయరామ నాయుడు మాట్లాడుతూ ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమం అద్భుతంగా జరిగిందని, ఈ బృహత్కర కార్యంలో తాను భాగస్వామ్యం కావడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు నెమలి వెంకటరమణ రావు, గొల్లాపిన్ని కృష్ణమూర్తి, మునిగోటి రమాదేవి, అక్షింతల కుమారస్వామి, అప్పలభట్ల ఆది నారాయణ శాస్త్రి, కాటేపల్లి భాస్కర రావు, అక్షింతల శంకర శర్మ పాల్గొన్నారు.

గృహ ప్రవేశానికి హాజరైన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కలికిరి

స్థానిక మండలంలోని పల్లవోలు గ్రామపంచాయతీ కస్బా నందు వైయస్సార్ పార్టీ నాయకుడు లక్ష్మీనారాయణ నూతన గృహప్రవేశానికి స్థానిక ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ వ్రతము పూజల పాల్గొని తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో పల్లవోలు గ్రామపంచాయతీ సర్పంచ్ బి బి ఆయేషా, ఇస్తియా అహ్మద్, జునేద్ అహ్మద్, షమీవుల్లా, పోస్ట్ రాజా, కార్యకర్తలు సచివాలయ సిబ్బంది తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

దళితవాడకు శ్మశాన స్థలం కేటాయింపు

ప్రజాశక్తి-పుల్లంపేట


హరిజనవాడకు కేటాయించిన శ్మశాన స్థలం

మండల పరిధిలోని కొమ్మనవారిపల్లి పంచాయతీ చొప్పవారిపల్లి హరిజనవాడ గ్రామస్తులు శ్మశానానికి స్థలం కేటాయించాలని తహశీల్దార్‌కు గతంలో వినతిపత్రం సమర్పించారు. సమస్యను గుర్తించిన తహశీల్దార్ కొమ్మనవారిపల్లె పొలం కింద సర్వే నెంబర్ 776లో 50 సెంట్ల ప్రభుత్వ భూమిని శ్మశాన వాటికకు కేటాయించారు. ప్రభుత్వ నిబంధనలు అనుసరించి తహశీల్దార్ నరసింహ కుమార్ చొప్పవారిపల్లి హరిజనవాడకు స్మశాన వాటిక స్థలమును కేటాయించినట్లు తెలిపారు. విఆర్‌ఓ సోమశేఖర్ రెడ్డి, ఆర్‌ఐ నవీన్, గ్రామస్తులు కటారు చంద్రమౌళి, ఖమ్మం దుర్గయ్య, కటారి వెంకటరమణ, కంభం కృష్ణమూర్తి, కటారి నరసింహులు, పెంచలయ్యలు ఆనందం వ్యక్తం చేశారు.

ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం

పులివెందుల రూరల్ : మున్సిపాలిటీ పరిధిలోని స్థానిక 22వ వార్డులో రాజ్యలక్ష్మి థియేటర్ పరిసర ప్రాం తాల్లో ఆదివారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని రాష్ట్ర సివిల్ సప్లయ్ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, కౌన్సిలర్ కోడి రమణ, లక్ష్మీ భార్గవి నిర్వహించారు. వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రసూల్, సచివాలయ కన్వీనర్ శ్రీరాములు, ప్రదీప్, వీణ,పాల్గొన్నారు.

సిరులు కురిపిస్తున్న 'లిటిల్ రెడ్' గులాబీ

ఆదర్శంగా నిలుస్తున్న నారిగానిపల్లి రైతులు

ప్రజాశక్తి - రామసముద్రం

'లిటిల్ రెడ్' గులాబీ పూల సాగు రైతులకు సిరులు కురిపిస్తోంది. గతంలో చాలా రకాల ఉద్యాన పంటలు పండిస్తూ నష్టాల ఊబిలోకి చిక్కుకొని రైతులు అప్పులపాలయ్యారు. ఏ పంట సాగు చేసినా కనీస పెట్టుబడులు దక్కక కష్టాల కడలిలో చిక్కుకున్నారు. మండలంలోని నారిగానిపల్లి, చెంబకూరు, కాప్పల్లి, ఆర్.నడింపల్లి, ఎలువనెల్లూరు, రామసముద్రం, వూలపాడు, చోక్కాండ్లపల్లి, మినికి, మాలేనత్తం, అరికెల, కుదురుచీమనపల్లి పంచాయతీలో కొందరు రైతులు వినూత్న పద్ధతులతో నిత్యం సిరులు కురిపిస్తున్న లిటిల్ రెడ్, బటన్ రోజా, మెరాబుల్ రకానికి చెందిన పూల సాగు చేసి నిత్యం ఆదాయం పొందుతున్నారు. మండల వ్యాప్తంగా 200 ఎకరాల్లో రైతులు సాగుచేస్తున్నారు. ప్రభుత్వం తరపున చిన్న సన్నకారు రైతులకు ఎకరాకు సబ్సిడీ ద్వారా రూ.6 వేలు, పెద్ద రైతులకు ఎకరాకు రూ.4 వేలు అందిస్తున్నారు. ఇప్పటి వరకు మండల వ్యాప్తంగా వెయ్యి మందికి పైగా రైతులు లిటిల్ రెడ్ గులాబీ పంటలు వేసి ముందుకు సాగుతున్నారు.

మార్కెట్ సౌకర్యం లేక ఇబ్బందులు

మండల ప్రాంతాల్లో పూల కొనుగోలుకు ప్రత్యేక మార్కెట్ సదుపాయం కల్పిస్తే తాము పండించిన పూలకు సరైన ధర లభించే అవకాశం ఉంటుందని రైతులు చెబుతున్నారు. ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్ యార్డ్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఇంటిల్లిపాదికి ఉపాధి

నాకు రెండెకరాల పొలం ఉంది. బెంగుళూరు నర్సరీ నుంచి 6 వేల సెంటు గులాబీ మొక్కలను తీసుక వచ్చాము. ఒక్కో గులాబీ మొక్కకు రూ.25 ఖర్చయింది. దిగుమతి చేసుకున్న 6 వేల మొక్కలను రెండెకరాల్లో నాటాము. డ్రిప్ ద్వారా గులాబీ మొక్కలకు నీరందిస్తున్నాం. ఇంటిల్లిపాదీ పొలాన్ని కంటికి రెప్పలా కాపాడుకుని సస్యరక్షణ చర్యలు చేపట్టాం. కుటుంబ సభ్యులమందరం స్వయం ఉపాధి కల్పించుకున్నాం.

-అరుణ, ఆదర్శ రైతు, ఎగువలంభంవారిపల్లి


సాగులో ఉన్న లిటిల్ రెడ్ గులాబీలను చూపుతున్న మహిళా రైతు

ఎకరాకు 30 కిలోల దిగుబడి

మొక్కలు నాటిన 3 నెలలకు గులాబీలు చేతికి వచ్చాయి. ప్రతి రోజు ఉదయాన్నే కుటుంబ సభ్యులంతా కలసి పూలను మదనపల్లె ప్రాంతాల్లో విక్రయాలు జరుపుతాము. కోసిన గులాబీలను రైతు నేరుగా మార్కెట్‌కు తీసుకెళ్లి హోల్‌సేల్ వ్యాపారులకు విక్రయాలు జరుపుతున్నాం. కిలో గులాబీ రూ.100 చొప్పున వ్యాపారులకు విక్రయించారు. ఎకరం తోట నుంచి నిత్యం 30 కిలోల వరకు పూల దిగుబడి వస్తోంది.

- రెడ్డెప్ప, రైతు, నారిగానిపల్లి

మెలకువలు పాటిస్తే అధిక లాభాలు

మండలం పరిధిలో గత ఏడాది కాలంగా పలువురు రైతులు తమ పొలాల్లో ఎకరం, రెండు ఎకరాల విస్తీర్ణంలో గులాబీ పూల తోటలను సాగుచేస్తూ ఉద్యాన పంటల సాగును విస్తరించారు. మొదట్లో ఎకరానికి 25 నుంచి 30 కిలోల వరకు పంటను ఇస్తాయి. ఒకసారి గులాబీ పంటను సాగు చేస్తే ఏడు నుంచి పదేళ్ల వరకు రైతుకు గులాబీలు అందిస్తూ పంట చేతికి వస్తూనే ఉంటుంది. పంట సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక నాణ్యమైన దిగుబడులు పొందవచ్చు.

- ఈశ్వర్ ప్రసాద్ రెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి

కేంద్రానికి పట్టని కడప ఉక్కు : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

కేంద్ర బడ్జెట్ సమావేశాల్లో కడప ఉక్కును కేంద్ర ప్రభుత్వం పూర్తిగా మరచిందని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ విమర్శించారు. స్థానిక జిల్లా పరిషత్ స్కూల్ లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గడిచిన ఇన్ని పార్లమెంటు సమావేశాల్లో, బడ్జెట్ సమావేశాల్లో కడప ఉక్కును ప్రతి సారీ నిర్లక్ష్యం చేస్తూ వస్తోందన్నారు. మొన్న జరిగిన బడ్జెట్ సమావేశాల్లో కూడా కడప ఉక్కుకు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదన్నారు. దీన్నిబట్టి కడప ఉక్కుపై కేంద్ర ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏంటో అర్థమవుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే రాయలసీమ ప్రాంతం కరువుతో, నిరుద్యోగంతో అల్లాడుతోందన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించక వలస పోతున్నారని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న ఈ ప్రాంతాన్ని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరించడం తగదన్నారు. విభజన చట్టంలో స్పష్టంగా రాసుకున్న కడప ఉక్కు, రాయలసీమకు ప్యాకేజీ రెండు అమలు కాలేదన్నారు. వీటి అమలు కోసం రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు సైతం పార్లమెంటులో కేంద్రంపై ఆశించిన రీతిలో పోరాటం చేయ లేద


సమావేశంలో మాట్లాడుతున్న శివకుమార్

న్నారు. ఇప్పటికైనా అధికార, విపక్షాలు రెండు ఈ ప్రాంత హక్కు అయిన కడప ఉక్కు కోసం కేంద్రంపై గళం విప్పాలని అన్నారు. కేంద్రం మెడలు వంచైనా కడప ఉక్కు సాధిద్దామని, యువత పోరాటాల్లో కలసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు డేవిడ్ రాజ్, నాయకులు కిరణ్, ఎర్రగుంట్ల మండల నాయకులు రాజు, గురులాల్ పాల్గొన్నారు.

వేసవికి సంకేతం.. కళింగర

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

కొన్ని పండ్లు, కాయలు మార్కెట్లోకి వచ్చాయంటే ఆ కాలాన్ని సూచిస్తాయి. వేసవి కాలం వచ్చిందనడానికి సంకేతం బజార్లల్లో కళింగర (పుచ్చకాయ), కర్బూజా, మామిడి కాయలు దర్శనమివ్వడమే. వేసవి కాలం రాక ముందే మనకు మార్కెట్లో కళింగర (పుచ్చకాయ), కర్బూజా కాయలు కనిపిస్తున్నాయి. నాడు రైతు చేతికి వచ్చే పంటను దళారులకు అమ్మే పరిస్థితి. ప్రస్తుతం కొందరు రైతులే పంటను ట్రాక్టర్‌లో బజార్‌కు తీసుకొచ్చి అమ్ముకుంటున్నారు. దళారులు పొలాల్లోకి వచ్చి మరి దారుణంగా రేటు అడుగుతున్నారు. అందుకే తామే పంటను కోసుకుని మార్కెట్‌కు తీసుకు వచ్చి సైజును బట్టి ఒక్కోకాయ రూ.30 నుంచి రూ.100 వరకు అమ్ముకుంటున్నామని రైతు చెబుతున్నారు. వేసవిలో కర్బూజా, దోస, కళింగర కాయలు తింటే మనిషి శరీరంలో నీటి శాతం పెరుగుదుంది. తద్వారా ఆరోగ్యంగా ఉండేందుకు దోహదపడుతుందని రైతులు పేర్కొంటున్నారు.


ట్రాక్టర్ ట్రాలీలోంచి కళింగర కాయలు అమ్ముతున్న రైతు

బాధితునికి 'పుట్టా' పరామర్శ

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని పాటిమీదపల్లె గ్రామానికి చెందిన టిడిపి నాయకులు దాసరి రవి కుమార్ యాదవ్ కుమా రుడు దిలీప్‌కుమార్ యాదవ్ ప్రమాదవశాత్తూ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స పొంది ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న మైదుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్, టిడిపి మండలశాఖ అధ్యక్షుడు తిప్పిరెడ్డి లక్ష్మిరెడ్డి, మండల టిడిపి నాయకులు సందుల నాగశివారెడ్డి ఆదివారం గ్రామానికి వెళ్లి ఆ యువకుడిని పరామర్శించారు. మెరుగైన చికిత్స పొంది త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు తుట్టే రాము యాదవ్, చెముళ్ల పల్లె మాజీ సర్పంచు వెంకటరామిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఏర్పాట్లపై అధికారుల పరిశీలన

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవస్థానం ఆవరణలో ఈనెల 18, 19 తేదీల్లో నిర్వహించనున్న మహాశివరాత్రి ఉత్స వాలకు సంబంధించి ఏర్పాట్లపై ఆదివారం అధికారులు పరి శీలించారు. ఆలయ ఇఒ శ్రీనివాసులు, చైర్మన్ వెంకటసుబ్బారెడ్డి, సర్పం చు కిషోర్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో మైదుకూరు రూరల్ సిఐ నరేంద్రరెడ్డి, ఎస్ఐ కెసి రాజు ఏర్పాట్లపై చర్చించారు. వీరభద్ర స్వామి దేవాలయానికి రెండు వైపులా వాహనాలు నిలుపుదల చేసే ప్రాంతాలను గుర్తించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లపై చర్చించారు. వాహనాలను దేవాలయం ఆవరణలోకి రాకుండా అవసరమైన పార్కింగ్ స్థలాన్ని పరిశీలించారు. క్యూలైన్లు, భక్తుల విచారణ కౌంటర్, ప్రథమ చికిత్స కేంద్రం, దుకాణాలు తది తర ఏర్పాట్లపై చర్చించారు. పోలీస్, ఆలయ సిబ్బంది కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

బకాయిలు వెంటనే చెల్లించాలి

- యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజ

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రావిడెంట్ ఫండ్, ఎపిజిఎల్ఐ రుణాలు, డిఎ అరియర్స్‌ను వెంటనే చెల్లించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ మేరకు ఆదివారం సాయంత్రం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలను చెల్లించకపోవడం దారుణమన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు తమ అవసరాల కోసం దాచుకున్న పిఎఫ్, ఎపిజిఎల్ఐ మొత్తాలను ప్రభుత్వం తమ అవసరాల కోసం వాడుకొని రెండు సంవత్సరముల గడుస్తున్నా నేటికీ విడుదల చేయకుండా కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీతాలను కావాలని ఆలస్యం చేస్తూ, రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని అందువల్లే జీతాల మంజూరు లోనూ, బకాయిల చెల్లింపులు ఆలస్యం అవుతున్నాయని ప్రకటించుకోవడం తగదన్నారు. ఒకపక్క రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగుందని సాక్షాత్తూ ముఖ్యమంత్రి అనేక సందర్భాల్లో ప్రకటించారని గుర్తు చేశారు. అలాంటప్పుడు జీతాలు, ఉద్యోగుల బకాయిలు ఎందుకు చెల్లించడం లేదని ఆయన ప్రశ్నించారు. జీతాలపై, ఉద్యోగ ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే ఉద్యోగులపై కక్ష సాధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. పాఠశాలల సందర్శన పేరుతో ఉపాధ్యాయులను విద్యాశాఖాధికారులు నిరంతరం వేధింపులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. ఉపాధ్యాయులను బోధనేతర కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తూ విద్యా బోధనకు ఆటంకం కలిగిస్తున్నారని ఆరోపించారు. ఎన్నికలకు ముందు సిపిఎస్ విధానాన్ని రద్దు చేస్తామని, ఉద్యోగ, ఉపాధ్యాయులకు మెరుగైన వేతనాలను అమలు చేస్తామని తెలిపారన్నారు. డిఎలు ఎప్పటికప్పుడు చెల్లిస్తామని హామీ ఇచ్చి మాట తప్పారన్నారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని అమలు చేసే పేరుతో ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం తమ వైఖరిని మార్చుకోవాలని ఆయన సూచించారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించకపోతే ఉద్యమాలు చేపడతామని లక్ష్మీరాజా హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్‌బాబు, జిల్లా కార్యదర్శి చెరుకూరి శ్రీనివాసులు, నాయకులు జి.వెంకటసుబ్బయ్య, ఎస్.చెన్నయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్రాభివృద్ధి

-ఎం.రమేష్‌కుమార్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తామని ప్రొద్దుటూరు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎం.రమేష్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తరపున రాహుల్ గాంధీ భారత్ జోడోయాత్ర విజయవంతం కావడం పట్ల ధన్యవాదాలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలోకి వస్తే, ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా, పునర్వ్యవస్థీకరణ, చట్టంలోని అన్ని అంశాలను నెరవేర్చడంతోపాటు కడపలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామన్నారు. సిపిఎస్ రద్దు చేసి, ఓపిఎస్ అమలు చేస్తామన్నారు. రూ.3లక్షల వరకు రుణమాఫీ, వ్యవసాయ రుణాలు, వంట గ్యాస్ రూ.500లకే అందుబాటులోకి తెస్తామన్నారు. నిరుపేదలకు నెలకు రూ.6000 ఆర్థికసాయం అందిస్తామని రాహుల్ గాంధీ హామీ ఇచ్చినట్లు వివరించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు రానున్న సార్వత్రిక ఎన్నికలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు.

విద్యార్థులకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

విద్యార్థులకు నిర్వహించిన క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశామని రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ కుండా భాస్కర్ తెలిపారు. స్థానిక ఎస్‌పి డిగ్రీ కళాశాలలో ఆదివారం మైలవరం మండలములోని పదవ తరగతి విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ పోటీలో వేపరాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మొదటి స్థానం, దొమ్మరనంద్యాల స్కూల్ విద్యార్థులు రెండవ స్థానంలో, మైలవరం స్కూల్ విద్యార్థులు మూడవ స్థానంలోనూ విజయం సాధించారన్నారు. వీరికి మెమొంటో, జిప్ ఫైల్, సర్టిఫికేట్ బహుమతిగా అందించామన్నారు. క్విజ్ మాస్టర్స్ వెంకటరామిరెడ్డికి, చిట్టి బాబుకు, ప్రసాద్‌రాజుకు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులకు, క్లబ్ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి కాటం పార్థసారధి, ఎస్‌పి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ నాగేశ్వరరెడ్డి, గురుకుమార్, గురుప్రసాద్, చౌడం చరణకుమారి, వేదవతి, శివశంకర్‌రెడ్డి, రోటరీక్లబ్ సభ్యులు లాయర్ మురళీధరరెడ్డి, సంజీవ రాయుడు, శ్రీనివాసులు, నారాయణ, డాక్టర్ సూర్యానారాయణ, ప్రిన్సిపల్ బండారు శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.


సమావేశంలో మాలల జెఎసి నాయకులు

మాలల సింహగర్జనను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మార్చి 12న నిర్వహించే మాలల సింహగర్జనను జయప్రదం చేయాలని కడప, అన్నమయ్య జిల్లాల మాలల జెఎసి నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఆర్అండ్‌బి బంగ్లాలో అన్ని మాలల జెఎసి నాయకులు సమావేశమై మార్చి నెల 12న రాజంపేట కళాంజలి గార్డెన్ నందు మాలల సింహ గర్జన కార్యక్రమాన్ని జెఎసి ఆధ్వర్యంలో నిర్వహిస్తామని అన్నారు. సింహగర్జన కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుండి మాల సంఘాల నాయకులు, సంస్థల అధ్యక్షులు భారీ స్థాయిలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాలల రాజంపేట జెఎసి కన్వీనర్ లింగం సంజీవ్, రైల్వే కోడూరు కన్వీనర్ చోడవరం సుబ్బ నర్సయ్య, నందలూరు కన్వీనర్ ఎ.విశ్వనాథ్, నందలూరు కన్వీనర్ ఇరువూరి శివయ్య, చిట్వేలు కన్వీనర్ పొల్లం రెడ్డి మల్లికార్జున, రైల్వే కోడూరు కన్వీనర్ కూని నారాయణ, చిట్వేలి కన్వీనర్ ఓబిలి పెంచలయ్య, పుల్లంపేట కన్వీనర్ గాలిశెట్టి సుధాకర్, పెనగలూరు కన్వీనర్లుగా పెనుబాల జయరామయ్య, గాలిశెట్టి శివశంకర్, శంకరయ్య, రాజంపేటకు కన్వీనర్లుగా సి.నరసింహులు, ఏ.బాలయ్య, బి.హరినాథ్, ఎస్.సుబ్బయ్య, ఆర్.చందు, శ్రీనివాసులు, శీనివాసులు పాల్గొన్నారు.

12న కమ్యూనిటీ భవన నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె మండలం బసినికొండ పంచాయతీలో శ్రీ మహర్షి వాల్మీకి ఆలయం, కమ్యూనిటీ భవన నిర్మాణానికి ఈనెల 12న భూమిపూజ నిర్వహించేందుకు జిల్లా వాల్మీకిసంఘం తలపెట్టారు. అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల నుంచీ వేలాది వాల్మీకిబోయల హాజరుకానున్న ఈ శంఖుస్థాపనకు ముఖ్య అతిధులుగా రాష్ట్ర పంచాయతీరాజ్, భూగర్భ గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మహమ్మద్ నవాజ్‌బాష, పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డిలు హాజరుకానున్నట్లు వాల్మీకి సంఘం పెద్దలు డాక్టర్ శివ, దొడ్డిపల్లి ఆనంద వెల్లడించారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు ఎమ్మెల్యే ద్వారకనాథ్ రెడ్డిని దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు.

క్రైం కార్నర్

యువతి ఆత్మహత్య

ప్రజాశక్తి-పీలేరు

అనుమానాస్పద స్థితిలో యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పీలేరు మండలంలో చోటు చేసుకుంది. ఆదివారం మండలంలోని రేగళ్ల పంచాయితీ, బోయపల్లిలో జరిగిన సంఘటనా వివరాలు పోలీసుల కథనం మేరకు ఇలా ఉన్నాయి. బోయపల్లికి చెందిన బాబు, మణెమ్మలకు డి.రాధిక, డి.శిరీష (21) ఇద్దరు సంతానం. రాధికకు వివాహమైనప్పటికీ తన తండ్రి మృతి చెందడంతో భర్త రెడ్డితో సహా తల్లి, చెల్లితోనే ఉంటోంది. ఇది ఇలా ఉండగా ఆదివారం శిరీష తమ ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్ కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. శిరీషకు తన బావ రెడ్డికి మధ్య లైంగిక సంబంధాలు ఉన్న విషయం బయట పడ్డంతో కుటుంబ సభ్యుల మధ్య గొడవ జరిగి, పరిస్థితి శిరీష ఆత్మహత్యకు దారితీసిందన్న అనుమానాలు స్థానికంగా వ్యక్తమవుతున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు.

కోడిపందెం రాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి -రామసముద్రం

మండలంలోని చెంబకూరు పంచాయతి టేకుపల్లి గ్రామానికి సమీపంలో టేకుపల్లి చెరువు పక్కన గల ఖాళీ ప్రదేశములో కోడి పందేలు ఆడుతున్న నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవీంద్రబాబు తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు..టేకుపల్లి చెరువు పక్కన నలుగురు వ్యక్తులు డబ్బులు పందెంగా పెట్టి కోళ్ళను పందేలు వదిలి జూదము ఆడుతున్నారని పక్కా సమాచారంతో తమ సిబ్బందితో దాడులు చేశామని తెలిపారు. కోడి పందెం ఆడుతున్న వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారివద్ద నుంచి రూ.2,300లు, రెండు కోడి పుంజులను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కలకడ : కోడిపందెం ఆడుతున్న పందెం రాయాళ్లను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. స్థానిక పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు.. మండలంలోని ఏనుగొండపాలెం పంచాయతీ రంగప్ప గారి పల్లి గ్రామానికి దక్షిణం వైపున ఉన్న పొలాల వద్ద ఉన్న వేపమాను కింద కొంత మంది వ్యక్తులు గుంపులుగా ఉండి కోడిపందెం జూదముగా ఆడుతుండగా అందులో చుట్టుముట్టి ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలలిపారు. వారి నుంచి రూ.7470 నగదు, రెండు కోడిపుంజులను స్వాధీనం చేసుకొని ఎనిమిది మందిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు ఈ దాడులలో హెడ్ కానిస్టేబుల్ రమేష్ బాబు, పోలీసులు శ్రీనివాసులు, తాతయ్య, యోగేష్, ప్రతాప్, రాజేంద్ర పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

ప్రజాశక్తి-గాలివీడు


మృతి చెందిన నక్కల వెంకటరమణారెడ్డి

పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని ఆవులవాండ్లపల్లిలో జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. నూలీవీడు పంచాయతీలోని ఆవుల వాండ్లపల్లికి చెందిన నక్కల వెంకటరమణారెడ్డి (70) పొలాలకు పిచకారి చేసే పురుగుల మందు తాగడంతో గమనించి బంధువులు రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారని తెలిపారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుమార్తె కానాల కళ్యాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకట శివ కుమార్ పేర్కొన్నారు.

క్యాంటీన్ యజమానిపై దాడి : కేసు నమోదు

ప్రజాశక్తి-కలికిరి

పట్టణంలోని ప్రసాద్ సినిమా థియేటర్‌లో క్యాంటీన్ నడుపుకొంటున్న బి.వేమా రెడ్డి పై దాడిచేసిన మహమ్మద్ షామీర్ పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సి.లోకేష్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు గత గురువారం అర్ధరాత్రి సమయములో టెలిఫోన్ ఎక్స్చేంజ్ వీధికి చెందిన మహమ్మద్ షామీర్ అర్ధరాత్రి సినిమా అయిపోయిన తర్వాత చిప్స్ ప్యాకెట్ కోసం వెళ్లి వేమా రెడ్డి పై దాడి చేసి బెదిరించినట్లు తెలిపారు. ఈ ఘటనపై ఆదివారం బాధితుడు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎస్ఐ ఆదేశాల మేరకు ఏఎస్ఐ మధుసూదనాచారి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భూ తగాదాలో అన్నదమ్ముల ఘర్షణ

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని పందికుంట గ్రామంలో ఆదివారం భూముల విషయంలో అన్నదమ్మల మధ్య జరిగిన ఘర్షణలో కాణాల నీలాంధ్ర రెడ్డి తలకు కొడవలి తో బలమైన గాయం కావడంతో రాయచోటి ప్రభుత్వ నుంచి కడప రిమ్స్ కు తరలించినట్లు ఎస్సై వెంకట శివకుమార్ పేర్కొన్నారు. సొంత తమ్ముడు కాణాల విశ్వనాథరెడ్డి అతని కుమారుడు కానాల నారాయణరెడ్డి కానాల నీరందర్ రెడ్డి పై దాడి చేసి గాయపరిచారని కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామంలోకి వెళ్లి శాంతి కుదిర్చి ఘర్షణలకు పాల్పడకుండా కౌన్సిలింగ్ ఇచ్చి నట్లు ఆయన పేర్కొన్నారు.



మార్చి 30 నుంచి 'కోదండ రాముడి'బ్రహ్మోత్సవాలు


ఒంటిమిట్ట : రెండో భద్రాద్రిగా పేరొందిన ఒంటిమిట్ట కోదండరాముని బ్రహ్మోత్సవాలు మార్చి 30 నుంచి నిర్వహించేందుకు టిటిడి ఏర్పాట్లకు సిద్ధం చేస్తోంది. ఈనేపథ్యంలో తిరుపతిలోని టిటిడి పరిపాలన భవనంలోని తన ఛాంబర్‌లో జెఇఒ వీరబ్రహ్మం అధికారులకు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోదండరామస్వామి కల్యాణానికి అవసరమైన తలంబ్రాల తయారీ,డిప్యుటేషన్ పై నియమించే అధికారులు, ఉద్యోగులతోపాటు శ్రీవారి సేవకుల వసతి, ఆహారం ఏర్పాట్లపై ముందస్తుగా ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. కల్యాణం రోజు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతున్నందున అన్నప్రసాదాల పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాటు చేయాలన్నారు. అలాగే, కల్యాణ వేదిక వద్ద పుష్ప, విద్యుత్ అలంకరణలు ఆకర్షించేలా చేయాలన్నారు. మార్చి 30 బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ, 31న ధ్వజారోహణంతో ప్రారంభమవుతాయన్నారు.

ఉపాధి లక్ష్యాన్ని అందుకుంటాం

- రూ.63 కోట్ల పనుల పూర్తికి కసరత్తు
- రోజుకు 55 వేల మంది హాజరుపై దృష్టి
- ప్రజాశక్తితో డ్వామా పీడీ యధుభూషణ్‌రెడ్డి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఉపాధి హామీ లక్ష్యాల్ని అధిగమిస్తాం. మార్చి నాటికి నిర్దేశిత లక్ష్యమైన రూ.203 కోట్ల మేర పనులు చేపట్టడానికి ప్రణాళికను సిద్ధం చేశాం. ఇప్పటికి 79 లక్షల పనులు చేపట్టడానికి రోజుకు 55 వేల మంది కూలీలు హాజరయ్యేలా దృష్టి సారించాం. ప్రస్తుతం రూ.22 వేల మంది హాజరవుతున్న నేపథ్యంలో లక్ష్య పరిపూర్తికి సంబంధించిన పనులపై ప్రత్యేకంగా దృష్టి సారించాం. వేసవి పరిస్థితుల నేపథ్యంలో ఫిబ్రవరి, మార్చి మాసాల్లో ఉపాధి పనులకు కూలీలు పెద్దఎత్తున హాజరయ్యే అవకాశాలు ఉన్నాయి. ఇందుకు అనుగుణంగా ఉపాధి హామీ పనుల కల్పన, ప్రభుత్వ నిర్దేశిత లక్ష్యాన్ని అధిగమించేందుకు అనుగుణంగా కసరత్తు చేశామని, వంద శాతం విజయవంతమయ్యే అవకాశం ఉందని పేర్కొంటున్న డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ పి.యధుభూషణ్‌రెడ్డితో ప్రజాశక్తి ముఖాముఖి...



ముఖా ముఖి..

జిల్లా జాబ్‌కార్డుదారులు వివరాలు తెలపండి?

జిల్లాలో 5.60 లక్షల మంది జాబ్‌కార్డు కలిగి ఉన్నారు. 4.60 లక్షల మంది పనులకు హాజరవుతున్నారు. వీరిలో 3.50 లక్షల మంది చురుకుగా పనుల్లో భాగస్వామ్యాన్ని కలిగి ఉన్నారు.

శ్రమశక్తి గ్రూపుల వివరాలు తెలపండి?

జిల్లాలో 6,800 శ్రమశక్తి సంఘాల గ్రూపులు ఉన్నాయి. ఒక్కో గ్రూపులో 20 నుంచి 40 మంది వరకు ఉన్నారు. మేట్‌ల ఆధ్వర్యంలోని శ్రమశక్తి సంఘాల గ్రూపుల్లోని లక్షలాది మంది సభ్యులు ఉపాధి హామీ పనులకు పెద్దఎత్తున హాజరవుతున్నారు.

ఉపాధి చెల్లింపుల వివరాలు తెలపండి?

2022-23లో రూ.338 కోట్లతో ఉపాధి హామీ పనులు చేపట్టడమైంది. రూ.224 కోట్ల మేరకు చెల్లింపులు చేశాం. రూ.203 కోట్ల ఉపాధి కూలీ చెల్లింపులకు, రూ.135.35 కోట్లు మెటీరియల్ కాంపొండ్ కింద ఖర్చు చేయాల్సి ఉంది. ఇప్పట వరకు ఉపాధి కూలీలకు వేజ్ కాంపొనెంట్ కింద రూ.138.37 కోట్లను, మెటీరియల్ కాంపొనెంట్ కింద రూ.65 కోట్ల మేరకు చెల్లింపులు చేశాం. రెండు వారాలకు సంబంధించిన చెల్లింపులు చేయాల్సి ఉంది. రూ.ఎనిమిది కోట్లను నాలుగు రోజుల్లోపు చెల్లింపులకు కస రత్తు జరుగుతోంది.

2023 ముగింపు నాటికి మిగిలిన పనిదినాలెన్ని?

69 లక్షల పనిదినాలను కల్పించాం. ఈ ఆర్థిక సంవత్సర ఆరంభంలో 45 లక్షల పనిదినాలు కల్పించడమే లక్ష్యం. జూన్ నాటికి లక్ష్యాన్ని అందుకున్నాం. మరో 16 లక్షల పనిదినాలు కల్పించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈలెక్కన 61 లక్షల పనిదినాలు కల్పించాల్సి వచ్చింది. 63 లక్షల పనిదినాలను కల్పించడంలో సఫలమయ్యాం. మరో 16 లక్షల పనిదినాలు కల్పన ఆదేశాల నేపథ్యంలో మార్చి నెలాఖరు నాటికి అదనపు లక్ష్యాల్ని అందుకునే ప్రయత్నంలో సఫలీకృతమవుతాం.

2023 ఉపాధి బడ్జెట్ ప్రతిపాదనల గురించి తెలపండి?

2023 ఆర్థిక సంవత్సర ఉపాధి హామీ బడ్జెట్ రూ.768 కోట్లకు ప్రతిపాదనలు పంపించాం. ఇందులో పర్సన్ డేస్ కింద 188.10 పనులు, ఉపాధి కూలి పద్దు కింద రూ.460.85 కోట్లు, మెటీరియల్ కాంపొండ్ పద్దు కింద 307.23 కోట్లు కేటాయించడమైంది.

ఉపాధి హామీ పనుల వివరాలు తెలపండి?

ఉపాధి హామీ కింద నాలుగు రకాల పనులకు ప్రాధాన్యత ఇవ్వడమైంది. ఇందులో ప్రధానంగా నీటి కుంటలు, నీటి వనరుల నిల్వ, భూసార పరిరక్షణకు సంబంధించిన మృత్తుకా క్రమక్షయ ఆధారిత పనులు, సాగునీటి కాల్వల పనులు చేపట్టడంపై దృష్టి సారించాం.

అమృత్ పథకం ప్రోగ్రెస్ ఎలా ఉంది?

జిల్లాలో 75 చెరువుల ఆధునీకరణ పనులు చేపట్టాం. ఇం దులో 48 చెరువుల ఆధునీకరణ పనులను పూర్తి చేయడమైంది. ఆగస్టు 15 నాటికి మిగిలిన 27 చెరువులను పూర్తిచేసి జాతీయ జెండాను ఎగురవేస్తాం.

అప్పర్‌భద్రతో రాయలసీమకు ముప్పు

-ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరి రెడ్డి

ప్రజాశక్తి -కడప అర్బన్



సమావేశంలో మాట్లాడుతున్న దస్తగిరి రెడ్డి

కర్ణాటకలో నిర్మి స్తున్న అప్పర్ భద్ర ప్రాజెక్టుకు కేంద్ర బడ్జెట్‌లో రూ.5,300 కోట్లు కేటాయించడం రాయలసీమ నీటి వనరులకు తీవ్ర ముప్పు వాటిల్లుతుందని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి. దస్తగిరి రెడ్డి తెలిపారు. ఆదివారం రైతు సంఘం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్ణాటకలో త్వరలో జరగనున్న ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు రెండు రాష్ట్రాల్లోని కరువు ప్రాంతాల ప్రజల మధ్య వైషమ్యాలు సృష్టించడానికి బిజెపి సిద్ధమైందన్నారు. నిత్యం కరువులకు గురవుతున్న రాయలసీమ జిల్లా ప్రజలకు కొంత మేరకైనా సాగు, తాగు నీరు అందించే తుంగభద్ర ప్రాజెక్టు పైన నిర్మించే 'అప్పర్ భద్ర' వల్ల రాయలసీమ ఎడారిగా మారుతుందని తెలిపారు. అనంతపురం, కర్నూలు, కడప జిల్లాలకు తుంగభద్ర నుంచి వచ్చే నీరే ప్రధాన సాగునీటి వనరని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ కు కేటాయించిన నీటిని తుంగభద్ర ఎగువ, దిగువ కాలువలు, కె.సి.కెనాల్ ద్వారా వినియోగించుకుంటున్నామని తెలిపారు. ఎగువ కాలువ కింద సాగుకు కావాలసిన మొత్తం ఆయకట్టు సుమారు 3 లక్షల ఎకరాలు అన్నారు. అందులో దుర్భిక్ష ప్రాంతమైన అనంతపురం జిల్లాలోని మొత్తం 26,75,764 ఎకరాల సాగుభూమిలో కేవలం 1,45,236 ఎకరాలకు మాత్రమే సాగునీరు అందే ఏకైక వనరని చెప్పారు. జిల్లాలో బిజెపి వైఖరికి వ్యతిరేకంగా విశాల ఐక్యతతో రైతాంగం ఉద్యమించడం ద్వారానే నీటి హక్కులను కాపాడుకోగలమని అయన అన్నారు. సమావేశంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గోపాలకృష్ణయ్య పాల్గొన్నారు.

బడుగుల అభివృద్ధే ధ్యేయం

చెన్నూరు : రాబోయే ఎన్నికల్లో వైసిపి విజయానికి కృషి చేస్తామని మైనార్టీ కాలనీకి చెందిన నంద్యాలపేట బాసూమియా, సీనియర్ వైసిపి నాయకులు అన్వర్‌బాష, స్కూల్ కమిటీ చైర్మన్ అబ్దుల్ రబ్, మార్కెట్‌యార్డు డైరెక్టర్ కరీం పేర్కొన్నారు. ఆదివారం వారు కార్యకర్తలతో అల్పాహార విందు ఏర్పాటు చేశారు. తామంతా కలిసికట్టుగా ఉన్నామని రాబోయే ఎన్నికల్లో మైనార్టీ కాలనీ నుంచి అత్యధిక మెజార్టీ వైసిపికి రావడం తథ్యమని వారు పేర్కొన్నారు, పార్టీలో నాయకుల మధ్య విభేదాలున్నాయని చెప్పే వారికి, ఈ విందే సమాధానమని వారు తెలియజేశారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ జి.ఎన్. భాస్కర్‌రెడ్డి, సీనియర్ నాయకులు ముదిరెడ్డి శివరాం రెడ్డి , మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు చీర్లసురేష్ యాదవ్, కొండపేట ఎంపిటిసి దుంప నాగిరెడ్డి, మైనార్టీ నాయకులు అశ్రత్ మండల కో- ఆప్షన్ సభ్యులు వారిష్ , మైనార్టీ నాయకులు చోటు,సాదు కిషోర్ కుమార్, సచివాలయ కన్వీనర్ నీలం గోవిందరెడ్డి, వైసిపి ఎస్టీ సెల్ మండల కన్వీనర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తున్న కార్పొరేటర్ ఉషశ్రీ

ప్రజాశక్తి -ప్రొద్దుటూరు



ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ ప్రజలకు సేవ చేస్తూనే మరొకపక్క జాతీయ స్థాయిలో బ్యాట్మింటన్ క్రీడాకారిణిగా రాణిస్తూ విశాఖ పేరు ప్రఖ్యతలను దేశ వ్యాప్తంగా నిలబెడుతున్నారు మహా విశాఖ నగర పాలక సంస్థలో 43వ వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ. ఆమె జివిఎంసి కార్పొరేటర్‌గా వార్డులో సమస్యల పరిష్కారానికి అహర్నిశలు కృషి చేస్తూనే మరొకపక్క తన ఆశయ సాధన కోసం నిరంతరం శ్రమించి సాధన చేస్తూ జాతీయ, రాష్ట్ర స్థాయి క్రీడాకారిణిగా రాణిస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవల కడప జిల్లా ప్రొద్దుటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి మాస్టర్స్ బ్యాట్మింటన్ ఛాంపియన్షిప్-2023లో 45 ఏళ్ల క్యాటగిరిలో సింగిల్స్, మిక్స్ డబుల్ గెల్చుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 26 జిల్లాల నుండి స్త్రీ, పురుషుల విభాగాలలో జరిగిన ఈ పోటీల్లో మహిళల సింగిల్స్ విభాగంలోనూ, మిక్సిడ్ డబల్ విభాగంలోనూ ఆమె ప్రథమ స్థానంలో గెలిచారు. ఈ రాష్ట్ర స్థాయి చాంపియన్షిప్ గెలుచుకున్న అనంతరం వచ్చే నెలలో గోవాలో జరగబోయే నేషనల్ ఛాంపియన్షిప్‌కు ఆమె ఆంధ్రప్రదేశ్ ప్రాతినిధ్యం వహించనున్నారు.

అల్పాహారం పంపిణీ

కడప అర్బన్ : నగరంలోని బాసట సేవా సంస్థ దాతల సహకారంతో రెండు సంవత్సరాలుగా ప్రభుత్వ సర్వేజన ఆసుపత్రిలో పల్లెలు నుంచి వచ్చే రోగుల సహాయకుల సేవార్థం ఉదయం 250 మందికిపైగా అల్పాహారం అందజే స్తున్నారు. ఈనేపథ్యంలో ఆదివారం డిఇఒ దేవరాజు తన సతీమణి విజయ సంస్మరణార్థం అన్నార్తులకు అప్పాహారంగా పొంగలి పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీవాణి పాఠశాల కరస్పాండెంట్ మాధవరెడ్డి, బాసట ఫుడ్ టీమ్ చంద్రమౌళి, ఈశ్వర్, రాంబాబు, మీకోసం విష్ణు, మాధవరెడ్డి పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్ఎంఎంఎస్ పరీక్ష

ప్రజాశక్తి-కడప అర్బన్



పరీక్షలను పర్యవేక్షిస్తున్న ఎస్ఎస్ఎ పిఒ

జిల్లా వ్యాప్తంగా 13 కేంద్రంలో జాతీయ ఉపకార వేతన (ఎన్ఎంఎంఎస్) పరీక్ష ప్రశాంతంగా నిర్వహించారు. కడప నగరంలోని మున్సిపల్ ఉర్దూ బాలుర పాఠశాల, ప్రాథమికోన్నత పాఠశాలల్లో డిఇఒ దేవరాజు, ఎస్ఎస్ఎ పిఒ డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాపితంగా 2,358 మందికిగాను 2,271 మంది విద్యార్థులు హాజరయ్యారని చెప్పారు. 8వ తరగతి పూర్తి కాబోతున్న ప్రభుత్వ పాటశాలలో చదివే విద్యార్థులకు స్కాలర్‌షిప్ కోసం పరీక్షలు నిర్వహించామని తెలిపారు. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వారికి 9,10,11,12 తరగతులు చదవడానికి ఏడాదికి రూ.12వేల చొప్పున ఉపకార వేతనం ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో చీఫ్ సూపరింటెండెంట్ నాగమణి, డిపార్ట్‌మెంటల్ స్క్వాడ్ విజయరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలి

కడప అర్బన్ : మున్సిపల్ క్వార్టర్స్‌లో వీధి దీపాల స్తంభాలు ఏర్పాటు చేయాలని సిఐటియు నగర అధ్యక్షులు పి.చంద్ర రెడ్డి డివైఎఫ్ఐ నగర కార్యదర్శి డి.ఎం. ఓబులేసు డిమాండ్ చేశారు. ఆదివారం శంకరాపురంలోని మున్సిపల్ క్వార్టర్స్‌లో సిఐటియు, డివైఎఫ్ఐ నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1971 సంవత్సరంలో నాటి ఇందిరాగాంధీ ప్రభుత్వంలో నగరంలో పారిశుధ్య కార్మికుల నివాసాలకు మున్సిపల్ క్వార్టర్స్‌లో స్థలాలు కేటాయించారని తెలిపారు. ఇక్కడి ప్రజలకు వీధి దీపాల స్తంభాల కూడా నోచుకోని పరిస్థితి నెలకొని ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే కార్పొరేషన్ యంత్రాంగం స్పందించి వీధి దీపాల స్తంభాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బడుగు వర్గాల అభివృద్ధికి కృషి

కడప అర్బన్ : ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ వర్గాల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని కమలాపురం ఎమ్మెల్యే పి రవీంద్రనాథ్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వైసిపి కార్యాలయంలోఎస్సీ, ఎస్టీ, ఉపాధ్యాయ సంఘం 2023 డైరీ, క్యాలెండర్ ఆవిష్కరించారు. ఉపాధ్యాయ సంఘ నాయకులు ఎమ్మెల్యే ని దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలలను ఉన్నతంగా అభివృద్ధి చేశారన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళుతున్నదన్నారు కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. గంగరాజు, నాయకులు మోహన్, కట్టా గంగాధర్, జయరాం, రాజబాబు, కృష్ణా నాయక్, వెంకటసుబ్బయ్య, సత్యమయ్య, దేవరాజు, కైలాష్, ప్రవీణ్, బాలు, విజయ, మంజుల, వైఎస్ఆర్ సీపీ నాయకులు రామచంద్రారెడ్డి, కొండారెడ్డి పాల్గొన్నారు.

'పుత్తా'ను ఎమ్మెల్యేగా గెలిపించుకుందాం

కడప అర్బన్ : టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు పుత్తానరసింహారెడ్డిని కార్యకర్తలు కష్టపడి పనిచేసి ఎంఎల్ఎగా గెలిపిద్దామని క్లసర్ ఇన్‌ఛార్జి వెంకటసుబ్బారెడ్డి పేర్కొన్నారు. చెన్నూరు మండలంలోని రామనపల్లెలో టిడిపి కార్యకర్తల సమావేశంనిర్వహించారు. ముందుగా టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మన్సూర్ అక్బర్ వెంకటసుబ్బారెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరమూ కృషి చేస్తున్నా పుత్తానరసింహారెడ్డిని గెలిపించుకోవాల్సిన అవసరమెంతైనా ఉందని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కృష్ణా రెడ్డి, హరినాథ్‌రెడ్డి, పవన్ కుమార్ రెడ్డి, ముండ్ల నరసింహా రెడ్డి, రమణారెడ్డి, శివా రెడ్డి, నాగసుబ్బా రెడ్డి, బిసి సెల్ టిడిపి జిల్లా అధికార ప్రతినిధి వేల్పుల సుబ్రహ్మణ్యం, విశ్వనాద్‌రెడ్డి,మల్లి, సిద్దేశ్వర్ పాల్గొన్నారు.

బకాయిల చెల్లింపులకు చట్టబద్ధత కల్పించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రభుత్వం ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు చెల్లింపులకు చట్టబద్ధత కల్పించాలని ఎపి జిఎ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమేష్ కుమార్, సుదర్శన్ రెడ్డి కోరారు. ఆదివారం ఎపిజిఎ కార్యాలయంలో ఉద్యోగుల బకాయిలు-చెల్లింపులు- చట్టబద్ధత అంశంపై జరిగిన చర్చా వేదిక నిర్వహించారు. వివిధ శాఖల ఉద్యోగుల ప్రతినిధులు హాజరయ్యారు. సమావేశంలో ఉద్యోగుల కు రావాల్సిన బకాయిలు, చెల్లింపుల కు చట్ట బద్ధత కల్పించాలని కోరారు. లేనిపక్షంలో ప్రతి ఉద్యోగి భారీగా నష్ట పోతారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ అంశాలపై అవగాహన కల్పిస్తూ ప్రతి శాఖ కార్యాలయంలో 90 రోజుల కార్యాచరణ, చర్చా వేదికలను ఏర్పాటు చేయ పోతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా నాయకుల అందరూ తమ తమ పరిధిలో ఉద్యోగులను సమాయత్తం చేయాలని నిర్ణయించారు.

సిపిఎస్‌ను రద్దు చేయాల్సిందే : యుటిఎఫ్

ప్రజాశక్తి - కడప అర్బన్



కలెక్టరేట్ ఎదుట దీక్షలో యుటిఎఫ్ నాయకులు

కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాల్సిందేనని, ప్రత్యామ్నాయంగా ప్రవేశపెడతామంటున్న జిపిఎస్‌ను ఒప్పుకొనే ప్రశ్నేలేదని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా పేర్కొన్నారు. సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల మూడో తేదీ విజయవాడ సమీపంలోని గన్నవరం ధర్మస్థలిలో చేపట్టిన సంకల్ప దీక్షను పోలీసులు భగ్నం చేయడాన్ని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన నిరసన దీక్షలో భాగంగా ఆదివారం కలెక్టరేట్ వద్ద యుటిఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సంకల్ప దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా లక్ష్మీరాజ మాట్లాడుతూ గత ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నేతగా ఉన్న జగన్మోహన్ రెడ్డి తాను అధికారంలోకి వస్తే వారంలోపే సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తానని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఆ మేరకు ఉద్యోగ, ఉపాధ్యాయుల అండదండలతో అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి, గద్దెనెక్కాక విస్మరించారనని విమర్శించారు. అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు అవుతున్నా సిపిఎస్ కొనసాగుతూనే ఉందని చెప్పారు. సిపిఎస్ పట్ల ముఖ్యమంత్రికి అవగాహన లేకపోవడం వల్లే రద్దు పై హామీ ఇర్చారని సలహాదారులు, ప్రభుత్వ పెద్దలు ప్రకటనలు ఇవ్వడం దారుణమన్నారు. జిపిఎస్ పేరుతో ఉద్యోగ, ఉపాధ్యాయులను మరోసారి వంచించేందుకు ఈ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని పేర్కొన్నారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ సిపిఎస్‌కు ప్రత్యామ్నాయంగా జిపిఎస్‌ను అంగీకరించే ప్రశ్నేలేదని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాల్సిందేనని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్బంధాలకు భయపడే ప్రశ్నే లేదని, ఇచ్చిన మాట ప్రకారం సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ ను పునరుద్ధరించాలని పేర్కొన్నారు. దీక్షలకు మద్దతుగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్, సిపిఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా కోశాధికారి మధుసూదనరావు ప్రసంగించారు. దీక్షలో సుదర్శన్, కరీముల్లా, సి.విరమణ, సుబ్బారెడ్డి, సూర్య కుమార్, బాబు, చెన్నయ్య, యుటిఎఫ్ జిల్లా కోశాధికారి కె.నర్సింహారావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎం.సుజాత రాణి, సిపిఎస్ కో కన్వీనర్ అయ్యవారురెడ్డి, నాయకులు చెన్నయ్య, జి.వెంకటసుబ్బయ్య, లింగారెడ్డి, గంగన్న , సునీల్, జావిద్, నరసింహారెడ్డి, ప్రకాష్, ఓబుల్ రెడ్డి, బాబు, శివశంకర్, జానకిరామ్, కిరణ్ బాబు పాల్గొన్నారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు ముఖ్యం

- అన్నమయ్య జిల్లా కలెక్టర్ పిఎస్.గిరీష

-హోరా హోరీగా సాగిన కలెక్టర్, ఎస్‌పి జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్

- 25 పరుగుల తేడాతో ఎస్‌పి జట్టు విజయం

ప్రజాశక్తి - కడప/రాయచోటి



విజేతగా నిలిచిన అన్నమయ్య జిల్లా ఎస్‌పి జట్టు

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీష పిఎస్ పేర్కొన్నారు. ఆదివారం కడపలోని వైయస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో అన్నమయ్య జిల్లా, కలెక్టర్ -11, ఎస్‌పి -11 జట్ల మధ్య టి20 క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. క్రీడాకారులను అన్నమయ్య కలెక్టర్ గిరీష, ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు, జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు భరత్ రెడ్డి, కార్యదర్శి ఏ. రెడ్డి ప్రసాద్, ఎస్‌సిఎసబ్ జోన్ అకాడమీ కన్వీనర్ సంజయ్ కుమార్ రెడ్డి పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రీడలలో పాల్గొని నిండు నూరేళ్లు ఆరోగ్యంగా జీవించాలన్నారు. ఈ క్రికెట్ పోటీలలో ఓడినవారు నిరుత్సాహం చెందకుండా రాబోయే మ్యాచ్ లో గెలవాలనే లక్ష్యంతో ముందుకు వెళ్లాలన్నారు. వైఎస్ఆర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ భరత్ రెడ్డి కడప మాస్టర్స్ క్రికెట్ క్లబ్ తరపున క్రికెట్ కిట్, 50 మందికి క్రికెట్ యూనిఫామ్ అందజేయడం ఎంతో శుభపరిణామన్నారు. ఎస్‌పి మాట్లాడుతూ కలెక్టరేట్, ఎస్‌పి కార్యాలయాల సిబ్బంది మంచి స్పోర్టివ్‌గా క్రికెట్ మ్యాచ్ ఆడారని చెప్పారు. విధి నిర్వహణలో ఉన్నప్పటికీ క్రికెట్ మ్యాచ్ ఇంతటితో ఆపకుండా క్రమం తప్పకుండా ప్రాక్టీస్ చేస్తూ క్రికెట్ ఆడుతూ ఉండాలన్నారు. దీంతో శరీర దృఢత్వంతో పాటు ఆరోగ్యంగా ఉంటామన్నారు. అనంతరం జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు టాస్ వేసి మ్యాచ్‌ను ప్రారంభించారు.

25 పరుగుల తేడాతో ఎస్‌పి జట్టు విజయం

కలెక్టర్, ఎస్‌పి జట్ల మధ్య ఆదివారం కడపలోని వైయస్ రాజారెడ్డి ఏసిఎస్ స్టేడియంలో నిర్వహించిన టి20 మ్యాచ్ లో 25 పరుగుల తేడాతో ఎస్పీ -11 జట్టు గెలిచింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఎస్‌పి జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 176 పరుగులు చేసింది. అనంతరం 177 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగుకు దిగిన కలెక్టర్ జట్టు 19.5 ఓవర్లలో 151 పరుగులకు ఆల్ అవుట్ అయ్యి ఓటమి చెందింది. ఎస్‌పి టీమ్‌కు చెందిన శ్రీనివాస్ 66 పరుగులు, 2,వికెట్లు తీసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ గా నిలిచారు. కలెక్టర్ టీంకు చెందిన పెంచలయ్య 5 ఫోర్లు, ఒక 6 మొత్తం 38 పరుగులతో బెస్ట్ బ్యాట్స్మెన్ గా నిలిచారు. బెస్ట్ బౌలర్ గా హేమంత్ రెడ్డి నిలిచారు. విన్నర్స్, రన్నర్స్ క్రికెట్ విజేతలకు జిల్లా కలెక్టర్, ఎస్‌పి చేతుల మీదుగా కడప మాస్టర్స్ క్రికెట్ క్లబ్ తరపున మెడల్స్, మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ భరత్ రెడ్డి, అన్నమయ్య జిల్లా కలెక్టరేట్, ఎస్‌పి కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి 'పోతుల'ను గెలిపించాలి

ప్రజాశక్తి- కడప అర్బన్



ప్రచారం చేస్తున్న డివైఎఫ్ఐ, సిపిఎం నాయకులు

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గాలకు పోటీ చేస్తున్న పిడిఎఫ్ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజుకు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి వేయించి అధిక మెజార్టీతో గెలిపించాలని డివైఎఫ్ఐ నగర కార్యదర్శి డిఎం ఓబులేసు, సిపిఎం ఆఫీస్ కార్యదర్శి జి. నారాయణ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గానికి పిడిఎఫ్ బలపరిచిన అభ్యర్థి పోతుల నాగరాజుకు విద్యార్థి, యువజన, కార్మిక, కర్షక, మహిళా సంఘాలు పూర్తి మద్దతును తెలియ జేస్తున్నాయని పేర్కొన్నారు. నిరుద్యోగ సమస్య పరిష్కారం ఉద్యోగ కార్మిక సమస్యలపై మండలిలో గళం విప్పాలన్నా ఆయన్ను అధిక మెజారిటీతో గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో చెన్నయ్య జిలాని బాష, విజయ్ పాల్గొన్నారు.

పోరుమామిళ్ల టౌన్ : పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థి పోతుల నాగరాజును గెలిపిం చాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు భైవరప్రసాద్ విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ఎదురుగా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగరాజు 32 సంవ త్సరాలుగా అనేక ఉద్యమాల్లో భాగస్వామ్యం అయ్యారని చెప్పారు. ఇలాంటి వారిని శాసన మండలికి పంపడం వల్ల ప్రజల గొంతుకను వినిపిస్తారని చెప్పారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు, ఐద్వా సం ఘం జిల్లా ఉపాధ్య క్షురాలు షేక్ గౌసియాబేగం, కెవిపిఎస్ మండల కార్యదర్శి కుసులూరు రవి, సిఐటియు మండల నాయకులు రత్నమయ్య, ఆవాజ్ మండల కార్యదర్శి బడే పీరా, ఐద్వా నాయకులు మేరీ ,బీబి పాల్గొన్నారు.

నర్సులను అవమానించడం దారుణం

కడపసిటీ : ఇటీవలి అన్‌స్టాఫబుల్‌షోలో సినీనటులు బాలకృష్ణ నర్సులను కించపరుస్తూ మాట్లాడడం శోచనీయమని వైఎస్ఆర్‌టియు యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వెంగల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మేసా ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వృత్తుల్లోకెల్లా అతిపవిత్రమైనది నర్సింగ్ వృత్తి అని గమనించుకోవాలని తెలిపారు. దేశంలో ఎందరో అనారోగ్యాల బారిన పడిన ఆస్పత్రులకు పరుగులు తీస్తున్న అభాగ్యులను అక్కున చేర్చుకుని వారి బాధలను గమనించి, వారి బాధలను నయం చేయడానికి ఎంతో ఓర్పుతో ప్రయత్నించే నర్సులను అగౌరవ పరచడం తగదని విజ్ఞప్తి చేశారు. ఎవరి పనులు, వృత్తులు, వాళ్లు చేసుకోవచ్చని, ఇతరుల వృత్తులను, పనులను, కార్యకక్రమాలను అగౌరవపరచే, కించపరిచే అధికారం ఎవరికీ లేదని, ఇటువంటి వ్యాఖ్యలు చేయకూడదని చెప్పారు.

ప్రజా ఆరోగ్యానికి కృషి : ఐఎంఎ

కడప అర్బన్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి ఐఎంఎ ప్రజా ఆరోగ్య పరిరక్షణకు కృషి చేస్తుందని రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రవి కృష్ణ డాక్టర్ త్యాగరాజు పేర్కొన్నారు. ఆదివారం ఐఎంఎ హాలులో జోనల్-3 కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ సంస్థల్లో ఐఎంఎ కూడా పెద్ద సంస్థ అన్నారు. ఇందులో ప్రభుత్వ, ప్రయివేటు వైద్యులు సభ్యులుగా ఉంటారని తెలిపారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ ధ్యేయంగా పని చేస్తామని చెప్పారు. వైద్యులపై దాడులు చేయడం బాధాకరమన్నారు. ఆరోగ్యశ్రీ 50 పడకల ఆసుపత్రికి వర్తింప చేస్తున్నారని, 25 పడకల ఆసుపత్రికి కూడా వర్తించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఫీజుల ప్యాకేజీని పెంచాలని తెలిపారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఫరూక్, కార్యదర్శి డాక్టర్ వినయ్, ఆకాష్, శ్రీనివాసులు, హేమలత పాల్గొన్నారు.

'ఉక్కు'ను ఏర్పాటు చేసే వరకూ పోరాటం

ప్రజాశక్తి - కడప



ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కడప జిల్లాలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేసేవరకూ పోరాటం చేస్తామని కాంగ్రెస్ నగర అధ్యక్షులు వై. విష్ణు ప్రీతంరెడ్డి పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్‌లో ఎపికి జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ ఆదివారం ఆర్టీసీ బస్టాండ్ వద్దనున్న అంబేద్కర్ సర్కిల్ వద్ద ధర్నా నిర్వహించారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినదించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నగర అధ్యక్షులు విష్ణు ప్రీతం రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న కేంద్ర ప్రభుత్వ సంస్థలను అమ్ముకుంటూ, రాష్ట్రానికి కేటాయించాల్సిన నిధులు ఇవ్వకుండా తీవ్ర అన్యాయం చేస్తున్నారని వాపోయారు. కడప జిల్లాలో ఉక్కు ఫ్యాక్టరీకి కేంద్ర బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం దారుణమని అన్నారు. కడప - బెంగళూరు రైల్వే మార్గానికి కేవలం రూ. 10 లక్షలు కేటాయిస్తే ఎన్ని సంవత్సరాలకు పూర్తవుతుందో కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. ఎపికి ప్రత్యేక హోదా రావాలన్నా కేంద్రంలో మళ్లీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పిసిసి కార్యదర్శి చీకటి చార్లెస్, కమలాపురం నియోజకవర్గం ఇన్‌ఛార్జి పొట్టి పాటి చంద్రశేఖర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నగర అధ్యక్షులు దాసరి శివ శంకర్ మధు రెడ్డి, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు మామిళ్ళ బాబు, లేబర్ సెల్ జిల్లా అధ్యక్షులు చెప్పలి పుల్లయ్య, అసిఫ్‌ఖాన్, మహిళ విభాగం, నగర అధ్యక్షురాలు, లావణ్య, లోకేశ్వరి, ఫరూక్, విజయ్, యువజన రాష్ట ప్రధాన కార్యదర్శి సుశీల్ పాల్గొన్నారు.

సచివాలయ అసోసియేషన్ జిల్లా కమిటీ ఎన్నిక

కడప అర్బన్ : గ్రామ వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులుగా కృపాకర్, కార్యదర్శి మునయ్య, కోశాధికారి శ్యామ్, ఉపాధ్యక్షులు జయకర్, నాగ భాస్కర్, ప్రహ్లాద రెడ్డి, ఆనంద్,శరత్, రియాజ్ భాష, జిల్లా సహాయ కార్యదర్శులుగా సుదర్శన్ రెడ్డి,చరణ్ కుమార్ రెడ్డి, శరత్ కుమార్, భార్గవ్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు మల్లికార్జున, ప్రకాష్ రావు, ప్రసాద్,సుధాకర్, మహమ్మద్ అలీ, హరికృష్ణ, ఖలీల్ బాష ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం జిల్లా పరిషత్ ప్రాంగణంలో జిల్లా ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయం ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జేఎల్‌ఎం గ్రేడ్2 ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం అన్ని జిల్లాలలో మన ఉద్యోగులను చైతన్యపరిచి రాష్ట్రస్థాయిలో ఒక సమావేశాన్ని కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యుత్ అధికారులు జీతాలు చెల్లించేది తామే అంటూ ప్రతి పనికీ ఉపయోగ పెట్టుకోవడమే కాకుండా గ్రామ వార్డు సచివాలయాల పరిధి దాటి పనులను అప్పుడెప్పుడు తీవ్రమైన ఇబ్బందులకు గురి చేస్తున్నారని వారన్నారు.

వృద్ధులకు అన్నదానం

కడప : కడప నగరం సబ్ జైల్ సమీపంలోని శ్రీ చౌడమ్మ వృద్ధాశ్రమంలో ఆదివారం వైఎస్ జగన్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షులు మలిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి తన తండ్రి కీర్తిశేషులు మలిరెడ్డి సుబ్బారెడ్డి 28వ వర్ధంతి సందర్భంగా వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ తన తండ్రి జ్ఞాపకార్థం ప్రతి ఏటా సామూహిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో చౌడమ్మ వృద్ధాశ్రమం నిర్వాకులు ఇస్మాయిల్, సమీర్, ఎం.వి. కృష్ణారెడ్డి,రాజా, శివశంకర్ పాల్గొన్నారు.



యువకుడిని పరామర్శిస్తున్న పుట్టా

బాధితునికి 'పుట్టా' పరామర్శ

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని పాటిమీదపల్లె గ్రామానికి చెందిన టిడిపి నాయకులు దాసరి రవి కుమార్ యాదవ్ కుమారుడు దిలీప్‌కుమార్ యాదవ్ ప్రమాదవశాత్తూ జీవిల రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయ పడ్డాడు. చికిత్స పొంది ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న మైదుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్, టిడిపి మండలశాఖ అధ్యక్షుడు తిప్పిరెడ్డి లక్ష్మిరెడ్డి, మండల టిడిపి నాయకులు సదరు గ్రామానికి ఆదివారం గ్రామానికి వెళ్లి ఆ యువకుడిని పరామర్శించారు. మెరుగైన చికిత్స పొంది త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు తుట్టే రాము యాదవ్, చెముళ్ల పల్లె మాజీ సర్పంచు వెంకటరామిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న పోలీస్, ఆలయ సిబ్బంది

మహాశివరాత్రి ఏర్పాట్లపై అధికారుల పరిశీలన

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవస్థానం ఆవరణలో ఈనెల 18, 19 తేదీల్లో నిర్వహించనున్న మహాశివరాత్రి ఉత్సవాలకు సంబంధించి ఏర్పాట్లపై ఆదివారం అధికారులు పరి శీలించారు. ఆలయ ఇఒ శ్రీనివాసులు, చైర్మన్ వెంకటసుబ్బారెడ్డి, సర్పంచ్ కిషోర్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో మైదుకూరు రూరల్ సిఐ నరేంద్రరెడ్డి, ఎస్‌ఐ కెసి రాజు ఏర్పాట్లపై చర్చించారు. వీరభద్ర స్వామి దేవాలయానికి రెండు వైపులా వాహనాలు నిలుపుదల చేసే ప్రాంతాలను గుర్తించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లపై చర్చించారు. వాహనాలను దేవాలయం ఆవరణలోకి రాకుండా అవసరమైన పార్కింగ్ స్థలాన్ని పరిశీలించారు. క్యూలైన్లు, భక్తుల విచారణ కౌంటర్, ప్రథమ చికిత్స కేంద్రం, దుకాణాలు తది తర ఏర్పాట్లపై చర్చించారు. పోలీస్, ఆలయ సిబ్బంది కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న బి.లక్ష్మీరాజా

బకాయిలు వెంటనే చెల్లించాలి

- యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రావిడెంట్ ఫండ్, ఎపిజిఎల్ఐ రుణాలు, డిఎ అరియర్స్‌ను వెంటనే చెల్లించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ మేరకు ఆదివారం స్థానికంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలను చెల్లించకపోవడం దారుణమన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు తమ అవసరాల కోసం దాచుకున్న పిఎఫ్, ఎపిజిఎల్ఐ మొత్తాలను ప్రభుత్వం తమ అవసరాల కోసం వాడుకొని రెండు సంవత్సరముల గడుస్తున్నా నేటికీ విడుదల చేయకుండా కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీతాలను కావాలని ఆలస్యం చేస్తూ, రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని అందుకే జీతాల మంజూరు లోనూ, బకాయిల చెల్లింపుల ఆలస్యం అవుతున్నాయని ప్రకటించుకోవడం తగదన్నారు. ఒకపక్క రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగుందని సాక్షాత్తు ముఖ్యమంత్రి అనేక సందర్భాల్లో ప్రకటించారని గుర్తు చేశారు. అలాంటప్పుడు జీతాలు, ఉద్యోగుల బకాయిలు ఎందుకు చెల్లించడం లేదని ఆయన ప్రశ్నించారు. జీతాలపై, ఉద్యోగ ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే ఉద్యోగులపై కక్ష సాధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. పాఠశాలల సందర్శన పేరుతో ఉపాధ్యాయులను విద్యాశాఖాధికారులు నిరంతరం వేధింపులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. ఉపాధ్యాయులను బోధనేతర కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తూ విద్యా బోధనకు ఆటంకం కలిగిస్తున్నారని ఆరోపించారు. ఎన్నికలకు ముందు సిపిఎస్ విధానాన్ని రద్దు చేస్తామని, ఉద్యోగ, ఉపాధ్యాయులకు మెరుగైన వేతనాలను అమలు చేస్తామని తెలిపారన్నారు. డిఎలు ఎప్పటికప్పుడు చెల్లిస్తామని హామీ ఇచ్చి మాట తప్పారన్నారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని అమలు చేసే పేరుతో ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం తమ వైఖరిని మార్చుకోవాలని ఆయన సూచించారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించకపోతే ఉద్యమాలు చేపడతామని లక్ష్మీరాజా హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాధవ విజయకుమార్, పాలెం మహేష్‌బాబు, జిల్లా కార్యదర్శి చెరుకూరి శ్రీనివాసులు, నాయకులు జి.వెంకటసుబ్బయ్య, ఎస్.చెన్నయ్య పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠలో పలువురు నేతలు

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని విశ్వనాథపురంలో నూతనంగా నిర్మించిన శ్రీ గణపతి సీతా లక్ష్మణ హనుమత్ సమేత శ్రీరామచంద్రుల ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాన్ని గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి, మాజీ మంత్రి డిఎల్ రవీంద్రారెడ్డి, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ విచ్చేశారు. ఈ సందర్భంగా వేద పండితులు వారికి ఘనస్వాగతం పలికి పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం గ్రామ పెద్దలు నాయకులను ఘనంగా సన్మానించారు. ప్రతిష్ఠ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపిపి టి.లక్ష్మయ్య, మాజీ ఎంపిపి డి.గురివిరెడ్డి, టిడిపి మండల శాఖ అధ్యక్షుడు అన్నవరం సుధాకర్‌రెడ్డి, మండల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, నాయకులు

'సీమ' నీటి వనరులకు తీవ్ర ముప్పు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

కర్ణాటకలో నిర్మిస్తున్న అప్పర్ భద్ర ప్రాజెక్టుకు కేంద్ర బడ్జెట్‌లో రూ.5,300 కోట్లు కేటాయించడం రాయలసీమ నీటి వనరులకు తీవ్ర ముప్పు అని సిపిఎం జమ్మలమడుగు కార్యదర్శి వీరనాల శివనారాయణ తెలిపారు. స్థానిక ఎన్‌జిఒ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కర్ణాటకలో త్వరలో జరగనున్న ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు రెండు రాష్ట్రాల్లోని కరువు ప్రాంతాల ప్రజల మధ్య వైషమ్యాలు సృష్టించడానికి బిజెపి సిద్ధమైందన్నారు. నిత్యం కరువులకు గురవుతున్న రాయలసీమ జిల్లా ప్రజలకు కొంత మేరకైనా సాగు, తాగు నీరు అందించే తుంగభద్ర ప్రాజెక్టుపైన నిర్మించే 'అప్పర్ భద్ర' వల్ల రాయలసీమ ఎడారిగా మారనుందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతపురం, కర్నూలు, కడప జిల్లాలకు తుంగభద్ర నుండి వచ్చే నీరే ప్రధాన సాగునీటి వనరు అని తెలిపారు. ఎపికి కేటాయించిన నీటిని తుంగభద్ర ఎగువ, దిగువ కాలువలు, కె.సి.కెనాల్ ద్వారా వినియోగించుకుంటున్నామని వివరించారు. ఎగువ కాలువ కింద సాగు కావలసిన మొత్తం ఆయకట్టు సుమారు 3 లక్షల ఎకరాలు కాగా, అందులో దుర్భిక్ష ప్రాంతమైన అనంతపురం జిల్లాలోని మొత్తం 26,75,764 ఎకరాల సాగుభూమిలో కేవలం 1,45,236 ఎకరాలకు మాత్రమే సాగునీరు అందే ఏకైక వనరు ఇదే అన్నారు. జిల్లాలో నిరంతరంగా వస్తున్న కరువుల వల్ల ఈ సాగునీటి పథకం క్రమంగా తాగు నీటి పథకంగా మారిపోయిందన్నారు. కృష్ణా బేసిన్‌లో భాగంగా ఉన్న తుంగభద్ర డ్యామ్‌పై దిగువనున్న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల అభిప్రాయాలను, అభ్యంతరాలను ఏ మాత్రం పరిగణలోకి తీసుకోలేదన్నారు. కృష్ణా బేసిన్‌కే ప్రమాదంగా మారుతున్న బిజెపి వైఖరికి వ్యతిరేకంగా విశాల ఐక్యతతో రైతులు ఉద్యమించడం ద్వారానే నీటి హక్కులను కాపాడుకోగలమన్నారు. సమావేశంలో సిపిఎం నాయకులు శ్రీను, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం నాయకులు శివనారాయణ

ప్రజల చెంతకే ప్రభుత్వ పథకాలు : ఎమ్మెల్యే



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రజల చెంతకే ప్రభుత్వ పథకాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. రూరల్ పరిధిలోని అమృత్‌నగర్‌లో ఆదివారం ఎమ్మెల్యే గడపగడపకూ మనప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడంతోపాటు అణగారిన వర్గాలకు సామాజికంగా, రాజకీయంగా పదవులిచ్చి, వారిలో ఆత్మవిశ్వాసాన్ని సిఎం పెంచారన్నారు. రానున్న ఎన్నికల్లో అన్ని వర్గాల ప్రజల మద్దతు తమ పార్టీకే ఉంటుందని ఎమ్మెల్యే రాచమల్లు పేర్కొన్నారు. కార్యక్రమాన్ని సర్పంచు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆప్కాబ్ చైర్ పర్సన్ మల్లెల ఝాన్సీ రాజారామ్‌రెడ్డి, జిల్లా ప్రచార కన్వీనర్ కల్లూరు నాగేంద్రరెడ్డి, ఎంపిపి శేఖర్ యాదవ్, వైసిపి రాష్ట్ర కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, కౌన్సిలర్లు వరికూటి ఓబులరెడ్డి, భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, శివారెడ్డి, కార్యదర్శి గురుమోహన్, వార్డు మెంబర్లు తిరుపేలురెడ్డి, సుబ్బారెడ్డి, ఓబులేసు, రెవెన్యూ అధికారులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది

ప్రజాశక్తి - చాపాడు

స్వర్ణ బిందు ప్రాసన చుక్కల మందు వేయించడం వల్ల పిల్లల్లో వ్యాధి నిరోధకశక్తి పెరిగి, జ్ఞాపకశక్తి మెరుగుపడుతుందని ఆయుర్వేద వైద్యశాల డాక్టరు రవికుమార్ తెలిపారు. మండల కేంద్రమైన చాపాడులోని ఆదిత్య ఆయుర్వేద గ్రామ్ ఆసుపత్రిలో ఆదివారం స్వర్ణ బిందు ప్రాసన చుక్కల మందు ఉచిత పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఎస్‌రఘురామిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదిత్య ఆయుర్వేద గ్రామం వైద్యశాల వారు చిన్న పిల్లల కోసం ఉచితంగా ఆయుర్వేద మందును పంపిణీ చేయడం మంచి విషయమన్నారు. 16 ఏళ్లలోపు పిల్లలకు ఈ చుక్కల మందు వేయించవచ్చని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి టి.లక్ష్మయ్య, వైసిపి మండల కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి, మాజీ సర్పంచు గూడూరు సుబ్బరాయుడు, రిటైర్డ్ విఆర్ఒ మనోహర్‌రెడ్డి, నాయకులు సివి సుబ్బారెడ్డి, జయసుబ్బారెడ్డి, లక్ష్మిరెడ్డి, విజయ్, వెంకటరెడ్డి, మనోహర్‌రెడ్డి, వైద్యశాల సిబ్బంది, చిన్నపిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



చుక్కల మందు వేస్తున్న ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

ప్రశాంతంగా ముగిసిన ఎన్ఎంఎంఎస్ పరీక్ష



పరీక్ష రాసి బయటికి వస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

పట్టణంలోని నాలుగు ప్రధాన కేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. నేషనల్ మెరిట్ కమ్ మీన్స్ (ఎన్ఎంఎంఎస్) స్కాలర్‌షిప్‌ప్రవేశ పరీక్షకు సంబంధించి ప్రొద్దుటూరు రోడ్డులోని సెయింట్ మేరీస్ హైస్కూల్‌లో 192 మంది, తాడిపత్రి రోడ్డులోని బాలాజీ హైస్కూల్‌లో 172 మంది, ముద్దనూరు రోడ్డులోని బాలుర జూనియర్ కళాశాలలో 192 మంది, బాలికల జూనియర్ కళాశాలలో 192 మంది మొత్తం నాలుగు కేంద్రాల్లో 748 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా.. 734 మంది హాజరయ్యారు. బాలజీలో నలుగురు, బాలుర జూనియర్ కళాశాలలో ఇద్దరు, సెయింట్ మేరీస్‌లో ఐదు మంది, బాలికల జూనియర్ కళాశాలలో ముగ్గురు మొత్తం 14 మంది పరీక్షకు గైర్హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పరీక్షను 8 వ తరగతి చదివే విద్యార్థులు రాశారు. ఇందులో మెరిట్ సాధించిన విద్యార్థికి కేంద్ర ప్రభుత్వం స్కాలర్‌షిప్ అందిస్తుంది. 748 మందిలో తెలుగు మాధ్యమంలో పరీక్ష రాసిన విద్యార్థులు 143 మంది ఉండడం గమనార్హం.

కేంద్రానికి పట్టని కడప ఉక్కు : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

కేంద్ర బడ్జెట్ సమావేశాల్లో కడప ఉక్కును కేంద్ర ప్రభుత్వం పూర్తిగా మరచిందని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ విమర్శించారు. స్థానిక జిల్లా పరిషత్ స్కూల్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గడిచిన ఇన్ని పార్లమెంటు సమావేశాల్లో, బడ్జెట్ సమావేశాల్లో కడప ఉక్కును ప్రతి సారీ నిర్లక్ష్యం చేస్తూ వస్తోందన్నారు. మొన్న జరిగిన బడ్జెట్ సమావేశాల్లో కూడా కడప ఉక్కుకు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదన్నారు. దీన్నిబట్టి కడప ఉక్కుపై కేంద్ర ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏంటో అర్థమవుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే రాయలసీమ ప్రాంతం కరువుతో, నిరుద్యోగంతో అల్లాడుతోందన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించక వలస పోతున్నారని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న ఈ ప్రాంతాన్ని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరించడం తగదన్నారు. విభజన చట్టంలో స్పష్టంగా రాసుకున్న కడప ఉక్కు, రాయలసీమకు ప్యాకేజీ రెండు అమలు కాలేదన్నారు. వీటి అమలు కోసం రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు సైతం పార్లమెంటులో కేంద్రంపై ఆశించిన రీతిలో పోరాటం చేయ లేదన్నారు. ఇప్పటికైనా అధికార, విపక్షాలు రెండు ఈ ప్రాంత హక్కు అయిన కడప ఉక్కు కోసం కేంద్రంపై గళం విప్పాలని అన్నారు. కేంద్రం మెడలు వంచైనా కడప ఉక్కు సాధిద్దామని, యువత పోరాటాల్లో కలసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు డేవిడ్ రాజ్, నాయకులు కిరణ్, ఎర్రగుంట్ల మండల నాయకులు రాజు, గురులాల్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శివకుమార్

పరిశుభ్రతకు నోచని బస్సు షెల్టర్



ప్రజాశక్తి - ఖాజీపేట

స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఆ ప్రాంత ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన బస్ షెల్టర్ పరిశుభ్రతకు నోచుకోవడంలేదు. అధ్వాన స్థితికి చేరుకొని ప్రమాదకరంగా మారింది. బస్ షెల్టర్‌లోని బండ పరుపు పూర్తిగా దెబ్బతిని, ఎగుడు దిగుడుగా మారింది. బస్ కోసం విద్యార్థులు ఇక్కడ వేచి ఉండాలంటే తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఆర్‌టిసి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులుగానీ పట్టించుకోలేదనే విమర్శలున్నాయి. బస్ షెల్టర్ మరమ్మతుల గురించి పట్టించుకొనకపోవడం వల్ల విద్యార్థులు, ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సివస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బస్ షెల్టర్ మరమ్మతులపై దృష్టి పెట్టాలని పలువురు కోరుతున్నారు.

వేసవికి సంకేతం.. కళింగర

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

కొన్ని పండ్లు, కాయలు మార్కెట్లోకి వచ్చాయంటే ఆ కాలాన్ని సూచిస్తాయి. వేసవి కాలం వచ్చిందనడానికి సంకేతం బజార్లల్లో కళింగర (పుచ్చకాయ), కర్బూజా, మామిడి కాయలు దర్శనమివ్వడమే. వేసవి కాలం రాక ముందే మనకు మార్కెట్లో కళింగర (పుచ్చకాయ), కర్బూజా కాయలు కనిపిస్తున్నాయి. నాడు రైతు చేతికి వచ్చే పంటను దళారులకు అమ్మే పరిస్థితి. ప్రస్తుతం కొందరు రైతులే పంటను ట్రాక్టర్‌లో బజార్‌కు తీసుకొచ్చి అమ్ముకుంటున్నారు. దళారులు పొలాల్లోకి వచ్చి మరి దారుణంగా రేటు అడుగుతున్నారు. అందుకే తామే పంటను కోసుకుని మార్కెట్‌కు తీసుకు వచ్చి సైజును బట్టి ఒక్కోకాయ రూ.30 నుంచి రూ.100 వరకు అమ్ముకుంటున్నామని రైతు చెబుతున్నారు. వేసవిలో కర్బూజా, దోస, కళింగర కాయలు తింటే మనిషి శరీరంలో నీటి శాతం పెరుగుదుంది. తద్వారా ఆరోగ్యంగా ఉండేందుకు దోహదపడుతుందని రైతులు పేర్కొంటున్నారు.



ట్రాక్టర్ ట్రాలీలోంచి కళింగర కాయలు అమ్ముతున్న రైతు



పురవీధుల గుండా వస్తున్న స్వామి రథోత్సవం

వైభవంగా రథోత్సవం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

శ్రీ పద్మావతి సమేత శ్రీ వేంకటరమణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం అత్యంత వైభవంగా స్వామి రథోత్సవం నిర్వహించారు. శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ చైర్మన్ వైయస్ మనోహర్‌రెడ్డి ఆదివారం ఉదయం పూజా కార్యక్రమాలను నిర్వహిం చారు. అనంతరం ఉద యం 10 గంటలకు స్వామివారి రథోత్సవం ప్రారంభమైంది. ఉభయ దారులకు ప్రత్యేక పూజ లను అర్చకులు నిర్వహించారు అనంతపురం వీధుల గుండా రథోత్సవం సాగింది. రథాన్ని లాగేందుకు యువత ఎంతో ఉత్సాహం కనబరిచారు. రథోత్సవం ముంగిట వివిధ రకాల నృత్యాలు, వివిధ రకాల వేషధారణలు అలరించాయి. పులివెందుల అర్బన్ సిఐ రాజు పర్యవేక్షణలో ఎస్ఐలు చిరం జీవి, హుస్సేన్, ఎఎస్ఐ స్వామి, హెడ్ కానిస్టేబుల్ రామగోవిందు, శ్రీనివాసులు, కానిస్టేబుళ్ల రామ్, రమేష్ బందోబస్తు నిర్వహించారు.



డాక్టర్ సిరాజుద్దీన్‌ను సత్కరిస్తున్న ఐఇఆర్‌టి యశోద

దాతల సహకారం మరవలేనిది

ప్రజాశక్తి - వేంపల్లె

దాతల సహకారం ఎప్పటికీ మరవలేనిదని ఐఇఆర్‌టి యశోద తెలిపారు. దాత సిరాజుద్దీన్‌ను ఆదివారం ఆమె సత్కరించారు. సంఘమిత్ర అధ్యక్షులు డాక్టర్ సిరా జుద్దీన్ లింగాల మం డలంలోని వెలిదండ్ల మహాత్మాగాంధీ పాఠశాలకు రూ.10వేలు విరాళం ఇచ్చినట్లు యశోద తెలి పారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల ప్రిన్సిపల్ చిన్న హరికుమార్ ఆదేశాల మేరకు డాక్టర్ సిరాజుద్దీన్‌ను సత్కరించినట్లు పేర్కొన్నారు. పాఠశాలకు తన వంతు సహకరించేందుకు ఎలాంటి సహాయం చేయడానికైనా ముందు ఉంటానని హామీ ఇచ్చినట్లు చెప్పారు.

నేడు అర్బన్ హెల్త్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి - జమ్మలమడుగు

స్థానిక కన్నెల్లూరు నేతాజీ నగర్‌లో నూతనంగా నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్‌ను సోమవారం ఉదయం ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి ప్రారంభిస్తున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ జి.వెంకట్రామిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ వేల్పుల శివమ్మ, వైస్ చైర్మన్లు పోరెడ్డి రామలక్షుమ్మ, మంగదొడ్డి సింగరయ్య, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు పాల్గొంటారని ఆయన తెలిపారు.



ప్రచారంలో నేతలు

ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

మున్సిపాలిటీ పరిధిలోని స్థానిక 22వ వార్డులో రాజ్యలక్ష్మి థియేటర్ పరిసర ప్రాం తాల్లో ఆదివారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని రాష్ట్ర సివిల్ సప్లయ్ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, కౌన్సిలర్ కోడి రమణ, లక్ష్మీ భార్గవి నిర్వహించారు. వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రసూల్, సచివాలయ కన్వీనర్ శ్రీరాములు, ప్రదీప్, వీణ, వైసిపి నాయకులు రమేష్, వాసు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్రాభివృద్ధి

-ఎం.రమేష్‌కుమార్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తామని ప్రొద్దుటూరు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎం.రమేష్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తరపున రాహుల్ గాంధీ భారత్ జోడోయాత్ర విజయవంతం కావడం పట్ల ధన్యవాదాలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలోకి వస్తే, ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా, పునర్వ్యవస్థీకరణ, చట్టంలోని అన్ని అంశాలను నెరవేర్చడంతోపాటు కడపలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామన్నారు. సిపిఎస్ రద్దు చేసి, ఒపిఎస్ అమలు చేస్తామన్నారు. రూ.3లక్షల వరకు రుణమాఫీ, వ్యవసాయ రుణాలు, వంట గ్యాస్ రూ.500లకే అందుబాటులోకి తెస్తామన్నారు. నిరుపేదలకు నెలకు రూ.6000 ఆర్థికసాయం అందిస్తామని రాహుల్ గాంధీ హామీ ఇచ్చినట్లు వివరించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు రానున్న సార్వత్రిక ఎన్నికలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు.

విద్యార్థులకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

విద్యార్థులకు నిర్వహించిన క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశామని రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ కుండా భాస్కర్ తెలిపారు. స్థానిక ఎస్‌పి డిగ్రీ కళాశాలలో ఆదివారం మైలవరం మండలములోని పదవ తరగతి విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ పోటీలో వేపరాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మొదటి స్థానం, దొమ్మరనంద్యాల స్కూల్ విద్యార్థులు రెండవ స్థానంలో, మైలవరం స్కూల్ విద్యార్థులు మూడవ స్థానంలోనూ విజయం సాధించారన్నారు. వీరికి మెమొంటో, జిప్ ఫైల్, సర్టిఫికేట్ బహుమతిగా అందించామన్నారు. క్విజ్ మాస్టర్స్ వెంకటరామిరెడ్డికి, చిట్టి బాబుకు, ప్రసాద్‌రాజుకు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులకు, క్లబ్ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి కాటం పార్థసారధి, ఎస్‌పి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ నాగేశ్వరరెడ్డి, గురుకుమార్, గురుప్రసాద్, చౌడం చరణకుమారి, వేదవతి, శివశంకర్‌రెడ్డి, రోటరీక్లబ్ సభ్యులు లాయర్ మురళీధరరెడ్డి, సంజీవ రాయుడు, శ్రీనివాసులు, నారాయణ, డాక్టర్ సూర్యనారాయణ, ప్రిన్సిపల్ బండారు శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బహుమతులు అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు